- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

బుధవారం
16-09-2026

సంపుటి : 01 సంచిక : 175 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE175 NAMASTEY MAHAAPRABHA



భారత్‌దే సిరీస్

- రెండో టీ20లోనూ ఆఫ్ఘనిస్తాన్ చిత్తు
- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్
- సంజూ, అభిషేక్ మెరుపులు
- 7 వికెట్లతో టీమిండియా ఘన విజయం

ఆఫ్ఘనిస్తాన్‌పై టీమిండియా జోరు కొనసాగింది. రెండో టీ20లోనూ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి.. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్‌లో మెరవగా.. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ బ్యాట్‌తో చెలరేగారు. 160 పరుగుల లక్ష్యాన్ని భారత్ 14.5 ఓవర్లలోనే ఛేదించింది.

03



నేడు 22ఎపై అసెంబ్లీలో కీలక చర్చ

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనపై సర్వత్రా ఉత్కంఠ
- మంత్రులతో ముందుగానే ముఖ్యమంత్రి సమాలోచనలు
- 22ఎ భూముల సమస్యలపై అధికారులకు ఆదేశాలు?
- ప్రతిపక్ష విమర్శలకు సీఎం కౌంటర్ ఇచ్చే అవకాశం
- ధరణి లోపాలపై సభలో వివరించనున్న రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ హయాం భూదందాలపై ప్రస్తావన
- ధరణి ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికపై స్పష్టత?
- 22ఎ చర్చ తర్వాత ఎల్‌ఆర్‌ఎస్‌పై లఘు చర్చ

హైదరాబాద్ సెప్టెంబర్ 15: (మహాప్రభ)
అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం పది గంటలకు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెక్షన్ 22ఏ అంశంపై చర్చ కొనసాగుతుందని అసెంబ్లీ కార్యదర్శి రేండ్ల తిరుపతి మంగళవారం తెలిపారు. 22ఏ అంశంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం చర్చను ప్రారంభించిన విషయం తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. 22ఏ అంశం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు,

-మిగతా 3 లో

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి ఆహ్వానం



- డిసెంబర్ 7 నుంచి ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్
- విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో భాగస్వామ్యానికి పిలుపు
- ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని కోరిన సీఎం రేవంత్
- సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరణకు విజ్ఞప్తి
- మూసీ పునరుజ్జీవనంతో నైట్ ఎకానమీకి ప్రణాళిక
- వారసత్వ కట్టడాల పరిరక్షణలో ఫౌండేషన్ పాత్రపై ప్రశంస
- ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ ఆసక్తి
- తాజ్ ఫలక్ నుమా ప్యాలెస్ లో ప్రిన్స్ తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్ సెప్టెంబర్ 15: (మహాప్రభ)
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ను కోరారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని ఆయన విజ్ఞప్తి చేశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మంత్రి అజహరుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్

-మిగతా 3 లో



లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

- ఇప్పటి నుంచే పునాదులు వేస్తున్న హస్తం పార్టీ
- పార్టీ సీనియర్ల పనితీరును సమీక్షిస్తున్న అధిష్ఠానం
- సంస్థాగత పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారింపు
- ప్రియాంక గాంధీకి కీలక పాత్ర అప్పగించే అవకాశం
- ద్వంద్వ నమూనాతో కాంగ్రెస్ పార్టీ ముందుకు
- విద్యార్థులతో మమేకమవడం ఈ వ్యూహంలో భాగమే
- జెన్ జెడ్, ఆల్ఫాలను ఆకట్టుకునేందుకు ప్రణాళికలు

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 15: (మహాప్రభ)
2029 లోక్‌సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, ప్రజా చేరువ కార్యక్రమాలపై దృష్టి సారిస్తోంది. పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా కలిసి సీనియర్ నేతల పనితీరును సమీక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల 130 మంది సీనియర్ నేతలను ఇద్దరూ పరిశీలించినట్లు నివేదికలు వెల్లడించాయి. పార్టీకి ప్రజల్లో మరింత చేరువ కావడం, ముఖ్యంగా యువత, మహిళలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం రాహుల్ గాంధీ ప్రధాన బాధ్యతగా

-మిగతా 3 లో

మసూద్ అజర్‌పై పాక్ నజరానా పెంపు

- ఆచూకీ తెలిపితే రూ.24 లక్షల బహుమతి
- 2021లో అఫ్ఘాన్‌కు పారిపోయినట్లు వెల్లడి
- కొత్త రెడ్‌బుక్‌లో అజర్ పేరు
- ఎఫ్‌ఏటీఎఫ్ భేటీ వేళ పాక్ చర్య
- పాక్ ప్రకటనలపై భారత్ విమర్శలు
- గతంలో గ్రే లిస్ట్‌లో పాకిస్థాన్
- ఉగ్ర నిధులపై చర్యలకు ఒత్తిడి
- పఠాన్‌కోట్, పుల్వామా దాడుల్లో నిందితుడు

03



యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

- రూ.2,000 దాటితే 0.4 శాతం ఎండీఆర్
- వినియోగదారులపై ఎలాంటి భారం లేదు
- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీల అమలు
- వ్యాపారులే చెల్లించనున్న ఎండీఆర్
- రూ.75 వేల లావాదేవీపై గరిష్ఠంగా రూ.300
- 95 శాతం లావాదేవీలకు ఛార్జీల నుంచి మినహాయింపు
- చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులకు ప్రత్యేక వెసులుబాటు
- నెలకు రూ.లక్ష దాటితే పెద్ద వ్యాపారులుగా గుర్తింపు



03

కేంద్రం ఒత్తిడికి తలవంచిన మెటా

- భారత్‌లో కార్యకలాపాలపై కీలక నిర్ణయం
- పిల్లల భద్రతపై మెటా కీలక హామీ
- సైబర్‌క్రైం పోర్టల్‌కు నేరుగా సమాచారం
- బాలల లైంగిక దోపిడీపై కేంద్రం ఆగ్రహం
- హానికర కంటెంట్ గుర్తింపు, తొలగింపుపై దృష్టి
- ఎన్‌సీపీసీఆర్ ముందు మెటా ప్రతినిధుల హాజరు
- ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్‌పై ఆరోపణల నేపథ్యంలో విచారణ
- ఇతర సామాజిక మాధ్యమాలకూ కేంద్రం హెచ్చరిక



03



ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

- రేవంత్ హామీలను నమ్మితే ఉద్యోగులకు అన్యాయమే
- పీఆర్సీ గడువు ముగుస్తున్నా నిర్ణయం ఏదీ?
- వేతన సవరణ కోసం ఉద్యోగుల ఎదురుచూపులు
- పెరుగుతున్న జీవన వ్యయంతో ఆర్థిక ఇబ్బందులు
- ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి
- పీఆర్సీపై ఉద్యోగ సంఘాలతో తక్షణమే చర్చలు
- హామీల అమలులో జాప్యంతో నమ్మకం కోల్పోయే ప్రమాదం
- ఆలస్యం చేస్తే ఉద్యమానికి సిద్ధం: తెలంగాణ రక్షణ సేన

హైదరాబాద్: సెప్టెంబర్ 15: (మహాప్రభ)
మాట తప్పడం, మడమ తిప్పడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రేడ్‌మార్క్‌గా మారిందని తెలంగాణ రక్షణ సేన విమర్శించింది. ముఖ్యమంత్రి ఇచ్చే హామీలను ఉద్యోగులు నమ్మితే చివరకు వారికి అన్యాయం తప్పదని ఆరోపించింది. ఉద్యోగుల పీఆర్సీ గడువు ముగిసే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఇకనైనా స్పందించి తక్షణమే 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు చాలాకాలంగా వేతన సవరణ కోసం ఎదురుచూస్తున్నారని తెలంగాణ రక్షణ సేన పేర్కొంది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీలు ఇస్తున్నప్పటికీ వాటిని

-మిగతా 3 లో



03

అంతరిక్షంలో మా వద్ద ఆయుధాలున్నాయ్

- తొలిసారి అమెరికా బహిరంగ ప్రకటన..
- శత్రు దాడులను తిప్పికొట్టడమే లక్ష్యంగా మోహరింపు
- ఆయుధాల సంఖ్య, ఆచూకీపై గోప్యత కొనసాగింపు
- రక్షణతోపాటు దాడులు చేయగల సామర్థ్యం
- కైనెటిక్, నాన్-కైనెటిక్ వ్యవస్థలతో ప్రతిదాడి
- చైనా, రష్యాల కదలికలపై అమెరికా అప్రమత్తం
- భవిష్యత్ యుద్ధాల్లో ఉపగ్రహాలే కీలకమన్న అంచనా
- అంతరిక్ష ఆయుధాలపై అంతర్జాతీయ ఒప్పందాల ఆంక్షలు

భూభారతి కాదు.. భూహారతి

రేవంత్ సర్కారు పథకం వెనుక కుంభకోణమే: కేటీఆర్

- ధరణితో భూములకు రక్షణ కవచం ఉండేది
- యజమాని వేలిముద్ర లేకుండానే లావాదేవీలపై ఆరోపణ
- భూయజమానులకు తెలియకుండానే నిషేధిత జాబితాలోకి
- ధరణి పోర్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- అసైన్డ్ భూముల హక్కుల హామీని అమలు చేయాలి
- సస్పెన్షన్‌తో వెనక్కి తగ్గేది లేదు.. ప్రజల్లోనే ఉంటాం
- 22ప అక్రమాలు, కమీషన్లను బయటపెడతాం: కేటీఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: (మహాప్రభ)
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చే ప్రతి పథకం వెనుక ఒక కుంభకోణం ఉంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్ భూములకు ఇనుప కంచెలా, రక్షణ కవచంలా పనిచేసేదని, ప్రస్తుతం భూ యజమానులకు తెలియకుండానే రిజిస్ట్రేషన్లు జరిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. భూ యజమాని వేలిముద్ర లేకుండా భూ లావాదేవీలు జరిగే అవకాశం గతంలో ఉండేది కాదని కేటీఆర్ అన్నారు.

-మిగతా 3 లో



21వేల పానీపురిలతో 13 అడుగుల ఎత్తైన గణేశుడు



పుణె సెప్టెంబర్ 15: (మహాప్రభ)
దేశవ్యాప్తంగా గణేశ్ నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. రకరకాల వినాయకుడి విగ్రహాలు అలరిస్తున్నాయి. మహారాష్ట్రలోని పుణెలో గణేశోత్సవం సందర్భంగా పానీపురిలతో ఓ భారీ వినాయకుడిని చేశారు. ఆ గణేశుడు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాడు. పుణెలోని ఎఫ్‌సీ రోడ్డులో ఉన్న గణేశ్ బేల్ షాపు ఓనర్లు పానీపురీలతో వినాయకుడిని రూపొందించారు. ఆ గణపతి 13 అడుగుల ఎత్తు ఉన్నాడు. సుమారు 21వేల పానీపురిలతో లంబోదరుడిని డిజైన్ చేశారు. రూపేశ్, దినేశ్ గుద్మేవర్ అనే ఇద్దరు కలిసి ఆ విఘ్నేశ్వరుడిని రూపొందించారు. ఎకో ఫ్రెండ్లీ రూపంలో ఈ వక్రతుండుడిని నిర్మించారు. గణేశ్ ఉత్సవాలు ముగిసిన తర్వాత నీటిలో నిమజ్జనం చేయడానికి బదులుగా 21వేల పానీపురిలతో ఆర్గానిక్ ఫెర్టిలైజర్‌ను తయారు చేయనున్నారు.

చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్‌పై ప్రభుత్వానికి రిపోర్ట్ చేస్తాం..

-మెటా కీలక నిర్ణయం



న్యూఢిల్లీ : సెప్టెంబర్ 15: (మహాప్రభ)
చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్‌పై ప్రభుత్వానికి సమాచారం అందిచేందుకు సోషల్ మీడియా దిగ్గజం మెటా అంగీకారం తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. చిన్న పిల్లల విషయంలో ఆన్‌లైన్ సేఫ్టీ అనేది సోషల్ మీడియా సంస్థల ప్రాథమిక సూత్రం అని, ఇండియా కేంద్రంగా పని చేసే ప్రతి సోషల్ మీడియా సంస్థ దీన్ని పాటించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది.తమ ప్లాట్‌ఫాంలపై చైల్డ్ అబ్యూజ్, సెక్సువల్ కంటెంట్‌ను నియంత్రించలేని సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పిల్లలకు సంబంధించి ఆన్‌లైన్ యాక్టివిటీ, కంటెంట్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఆన్‌లైన్‌లో మైనర్ల భద్రతకు తమ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇలాంటి కంటెంట్ విషయంలో సోషల్ మీడియా సంస్థలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, వెంటనే తొలగించాలని ఆయా సంస్థల్ని ఆదేశించింది. దీంతో చైల్డ్ అబ్యూజ్ కంటెంట్‌ను గుర్తించి, తొలగించి, వాటిపై చట్టబద్ధ సంస్థలకు సమాచారం అందిస్తామని మెటా ప్రభుత్వానికి హామీ ఇచ్చింది.ఈ విషయంలో ఇది మొదటి అడుగు అని ప్రభుత్వం వివరించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో ఎలాంటి వేధింపులు, అభ్యంతరకర కంటెంట్ ఉండకుండా, సురక్షితంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా కొద్ది రోజుల క్రితం మెటాకు ప్రభుత్వం నోటీసులు కూడా జారీ చేసింది. చివరకు తమ తప్పుపై మెటా ఇటీవల క్షమాపణలు కూడా చెప్పింది. మెటాకు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు ఉన్న సంగతి తెలిసిందే.

ఈ నెల 19న రుతుపవనాల తిరోగమనం ఆరంభం..

-భారత వాతావరణ కేంద్రం వెల్లడి..!



న్యూఢిల్లీ : సెప్టెంబర్ 15: (మహాప్రభ)
దేశంలో నైరుతి రుతుపవనాల తిరోగమన ప్రక్రియ ప్రారంభానికి సమయం దగ్గరపడిందని భారత వాతావరణ కేంద్రం అధికారికంగా వెల్లడించింది. ఈ నెల 19 నుంచి పశ్చిమ రాజస్థాన్ లోని కొన్ని ప్రాంతాల నుంచి రుతుపవనాల ఉపసంహరణకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నది. సాధారణంగా సెప్టెంబర్ 17న ప్రారంభం కావాల్సిన ఈ ప్రక్రియ ఈ ఏడాది రెండు రోజులు ఆలస్యంగా మొదలవుతోంది.రాజస్థాన్‌లో ఉపసంహరణ ప్రారంభమైనప్పటికీ.. మధ్య, తూర్పు, దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో సెప్టెంబర్ 21 వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టంచేసింది. ముఖ్యంగా 18 నుంచి 20 మధ్య కోస్తాంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం రుతుపవనాలపై తీవ్రంగా పడింది. సెప్టెంబర్ 13 నాటికి దేశవ్యాప్తంగా 15 శాతం మేర వర్షపాతలోటు నమోదైంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో 28 శాతం తక్కువ వర్షపాతం నమోదవడం గమనార్హం.తెలంగాణ రాజకీయ విశ్లేషణ రాష్ట్రాల వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్‌లో 43 శాతం, కర్ణాటకలో 29 శాతం, కేరళలో 27 శాతం మేర వర్షపాత లోటు నమోదైంది.

ట్రంప్ సర్కార్‌కు కోర్టులో భారీ ఎదురుదెబ్బ.

విద్యార్థులు, జర్నలిస్టుల వీసాల పరిమితులపై బ్రేక్



న్యూఢిల్లీ : సెప్టెంబర్ 15: (మహాప్రభ)
విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, జర్నలిస్టులపై వీసా నిబంధనలను కఠినతరం చేయాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయానికి అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. విదేశీయులు అమెరికాలో ఎంతకాలం ఉండవచ్చనే దానిపై పరిమితులు విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనను బోస్టన్‌లోని ఫెడరల్ న్యాయమూర్తి నిలిపివేశారు. ఈ నిబంధన అమల్లోకి రావడానికి ఒక్కరోజు ముందు యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎఫ్. డెన్నిస్ సేలర్ ఈ తీర్పు ఇవ్వడం గమనార్హం. కార్మిక సంఘాలు, ఉన్నత విద్యా రంగానికి చెందిన పలు సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (ఐఎస్) ఇచ్చిన వివరణలు సరిపోవని స్పష్టం చేసింది. విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, జర్నలిస్టుల బస కాలాన్ని పరిమితం చేయడానికి హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం జాతీయ భద్రత, వీసా వ్యవస్థలో మోసాలను అరికట్టడం వంటి కారణాలను చూపిందని జడ్జి తెలిపారు. అయితే ఈ విధాన మార్పు వల్ల తలెత్తే సమస్యలను సమర్థంగా పరిశీలించడంలో, తక్కువ కఠినమైన ప్రత్యామ్నాయాలను పరిగణనలోకి తీసుకోవడంలో ఆ శాఖ విఫలమైందని పేర్కొన్నారు. ఐఎస్ ఇచ్చిన కారణాలను "అత్యంత బలహీనమైనవి"గా జడ్జి అభివర్ణించారు. కొత్త నిబంధన అమల్లోకి వస్తే దాదాపు ఐదు దశాబ్దాలుగా అమెరికాలో అమల్లో ఉన్న విధానంలో భారీ మార్పు వచ్చేది. ప్రస్తుతం విదేశీ విద్యార్థులు తమ విద్యా కార్యక్రమం కొనసాగుతున్నంత కాలం చట్టబద్ధంగా అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంది. అయితే ట్రంప్ ప్రభుత్వం జూలైలో తీసుకొచ్చిన కొత్త నిబంధనతో ఈ విధానాన్ని మార్చాలని నిర్ణయించింది. విదేశీ విద్యార్థులు, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల్లో పాల్గొనేవారికి నిర్దిష్ట కాలపరిమితి విధించడంతో పాటు జర్నలిస్టుల వీసాలపైనా పరిమితులు పెట్టాలని ప్రతిపాదించింది.

కొత్త నిబంధన ప్రకారం.. F, J, I వీసాలపై పరిమితులు

F వీసా: విదేశీ విద్యార్థులకు గరిష్ఠంగా నాలుగేళ్ల పరిమితి

J వీసా: సాంస్కృతిక, విద్యా మార్పిడి కార్యక్రమాల్లో పాల్గొనేవారికి నాలుగేళ్ల పరిమితి

× వీసా: విదేశీ జర్నలిస్టులకు ప్రస్తుతం సంవత్సరాలపాటు కొనసాగుతున్న బసను 240 రోజులకు పరిమితం చేసే ప్రతిపాదన

ప్రస్తుతం అమెరికాలో సుమారు 16 లక్షల మంది ఖీ వీసా కలిగి ఉండగా, మరో 5 లక్షల మంది జీ వీసాపై ఉన్నారు. ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రముఖ పరిశోధనా విశ్వవిద్యాలయాల్లోనూ భారీ సంఖ్యలో విదేశీ విద్యార్థులు, ముఖ్యంగా గ్రాడ్యుయేట్ స్థాయిలో చదువుతున్నారని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే విదేశీ విద్యార్థుల చేరికలు తగ్గే అవకాశం ఉందని, ప్రముఖ విశ్వవిద్యాలయాలకు వందల మిలియన్ డాలర్ల వరకు అదనపు ఆర్థిక భారం పడే ప్రమాదం ఉందని న్యాయమూర్తి హెచ్చరించారు. విదేశీ విద్యార్థులు, పరిశోధకులు దశాబ్దాలుగా అమెరికా శాస్త్ర, వైద్య, సాంకేతిక రంగాల అభివృద్ధికి కీలకంగా దోహదపడ్డారని ఆయన గుర్తుచేశారు. వారి ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకూ గణనీయమైన ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. "ఉన్నత విద్యా వ్యవస్థతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టం విపత్తు స్థాయిలో ఉండే అవకాశం ఉంది" అని జడ్జి సేలర్ హెచ్చరించారు. ఈ తీర్పుతో విదేశీ విద్యార్థులు, పరిశోధకులు, ఎక్స్ఛేంజ్ సందర్శకులు, విదేశీ జర్నలిస్టులపై ప్రతిపాదించిన వీసా కాలపరిమితులకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయితే ట్రంప్ ప్రభుత్వం ఈ తీర్పుపై తదుపరి న్యాయపరమైన చర్యలకు వెళ్లే అవకాశం ఉంది.

సౌదీ అరేబియాలో 110 మిలియన్ టన్నుల యురేనియం నిల్వలు

- యుద్ధం వేళ సౌదీ జాక్‌పాట్



న్యూఢిల్లీ : సెప్టెంబర్ 15: (మహాప్రభ)
ఇరాన్ యుద్ధం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సౌదీ అరేబియాకు భారీ జాక్‌పాట్ తగిలింది. సౌదీ అరేబియాలో 110 టన్నుల ముడి యురేనియం నిల్వలు ఉన్నట్లు వెల్లడైంది. మెదీనా ప్రాంతంలో యురేనియం సహా పలు అరుదైన ఖనిజాలు బయటపడ్డట్లు సౌదీ అరేబియాకు చెందిన ఎనర్జీ మినిస్టర్ ప్రిన్స్ అబ్దులాజిజ్ బిన్ సల్మాన్ అన్నారు.మెదీనా ప్రాంతంలోని జబల్ సయిద్ ప్రాజెక్టు వద్ద అధ్యయనం చేస్తుండగా 110 టన్నుల అరుదైన ఖనిజాలు, యురేనియం నిల్వలు లభ్యమైనట్లు ఆయన వెల్లడించారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రస్తుతం సౌదీ చాలా ఇబ్బందులు పడుతోంది. ముఖ్యంగా ఇరాన్ మద్దతుదారులైన హౌతీ ఉగ్రవాదులు సౌదీ అరేబియాపై దాడులకు దిగుతోంది. దీనివల్ల అక్కడి చమురు క్షేత్రాలు దెబ్బతింటున్నాయి. పోర్టులపై, చమురు నౌకలపై దాడి జరుగుతోంది. దీనివల్ల సౌదీ తీవ్రంగా నష్టపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో యురేనియం నిల్వలు బయటపడటం ఆ దేశానికి భారీ ఊరటనిచ్చేదే.డిక్షనరీలు శోధించండి సున్నీలకు చెందిన సౌదీ అరేబియాకు.. షియాలకు చెందిన ఇరాన్‌కు మధ్య ఘర్షణ నెలకొంది. అయితే, ఇప్పుడు పరిస్థితుల్ని చక్కదిద్దుకునేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు సౌదీ అరేబియా కూడా 2030లోపు అణ్వాయుధ శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. అమెరికాతో కలిసి సౌదీ అణు కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇలాంటి తరుణంలో యురేనియం బయటపడటం కలిసొచ్చే అంశమే.

తీవ్ర దుమారం రేపుతున్న స్పోర్ట్స్ యాప్ యాడ్



న్యూయార్క్ సెప్టెంబర్ 15: (మహాప్రభ)
అమెరికా నటి సిడ్నీ స్వీనీతో చేసిన ఓ యాడ్ తీవ్ర దుమారం రేపుతున్నది. క్రీడల్లోని మహిళలను శృంగారభరితంగా చూపిస్తున్నట్లు ఆ యాడ్ ఉందని విమర్శలు వస్తున్నాయి. స్పోర్ట్స్ మార్కెట్ ట్రేడింగ్‌కు చెందిన నోవిగ్ యాప్‌ను నటి సిడ్నీ ప్రమోట్ చేసింది. ఆ ప్రకటనలో ఆమె దాదాపు నగ్నంగా నటించింది. అయితే ఫుట్‌బాల్‌తో పాటు ఇతర క్రీడా వస్తువులతో ఆమె తన శరీరాన్ని కప్పుకుని ట్రేడింగ్ యాప్‌ను ప్రమోట్ చేసింది. ఇక సోషల్ మీడియాలో అనేక మంది మహిళా అథ్లెట్లు ఆ యాడ్‌ను తప్పుపట్టారు. మహిళలను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. నాలుగు సార్లు ఒలింపిక్ స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ గెలిచిన ఏరియార్నే టిట్‌మస్ స్పందిస్తూ ఆ యాడ్‌ను చూస్తున్నప్పుడు ఆవేశం వస్తున్నట్లు ఆమె అన్నారు. స్త్రీ శరీరాలను డబ్బు సంపాదన కోసం వాడుతుంటే, మహిళా క్రీడలు ఎలా వృద్ధి చెందుతాయని ఆమె ప్రశ్నించారు. బ్రిటీష్ స్ప్రింటర్ ఆమే హంట్, యూఎస్ జిమ్నాస్ట్ గ్రేసీ క్రామర్ కూడా ఆ యాడ్‌ను తప్పుపట్టారు. రగ్బీ ప్లేయర్ సోఫీ ఫెల్లా స్పందిస్తూ.. సిడ్నీ నటించిన యాడ్ మహిళలను కించపరిచే రీతిలో ఉన్నట్లు పేర్కొన్నది. నటి స్వీనీ గతంలో రెండు సార్లు ఎమ్మీ అవార్డుకు నామినేట్ అయ్యింది. అమెరికన్ ప్రొఫెషన్ బాక్సర్ క్రిస్టీ మార్టిన్ బయోపిక్‌పై తీసిన క్రిస్టీలో ఆమె నటించింది.

కేదార్‌నాథ్‌లో విరిగిపడ్డ కొండచరియలు..

-7350 యాత్రికులు సురక్షితంగా తరలింపు



రుద్రప్రయాగ్: సెప్టెంబర్ 15: (మహాప్రభ)
ఉత్తరాఖండ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో .. కేదార్‌నాథ్ మార్గంలో ఉన్న ట్రెక్కింగ్ రూట్‌లో రెండు రోజుల క్రితం కొండచరియలు విరిగిపడ్డ విషయం తెలిసిందే. మంగళవారం అక్కడ నుంచి సుమారు 150 మందిని రక్షించారు. దీంతో మొత్తం ఆ ప్రాంతం నుంచి 7350 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ఈ విషయాన్ని ఇవాళ తెలిపింది. ఎస్ఈఓసీ రిపోర్టు ప్రకారం కేదార్‌నాథ్ ధామ్ నుంచి తిరుగు ప్రయాణం అవుతున్న వారిని చిర్‌బాసా వద్ద రక్షించినట్లు తెలిపారు. ప్రస్తుతం చిర్‌బాసా వద్ద ఇంకా శిథిలాలను తొలగిస్తున్నారు. కొండ రాళ్లు కింద పడడం వల్ల .. రెండు రోజుల క్రితమే ట్రెక్కింగ్ మార్గాన్ని ఆపేశారు.అయితే మళ్లీ ఆ రూట్‌ను ఓపెన్ చేశారు. దీంతో పాటు హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించినట్లు తెలుస్తోంది. యాత్రికులతో పాటు సుమారు 1200 గుర్రాలను కూడా రక్షించారు. గౌరికుండ్‌కు 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిర్‌బాసా హెలిప్యాడ్ సమీపంలో క్లియరెన్స్ పనులు చేపట్టారు. యుద్ధ ప్రాతిపదికన ఆ మార్గాన్ని ఓపెన్ చేసేందుకు పనిచేస్తున్నారు. అయితే చిర్‌బాసా మార్గాన్ని పూర్తిగా క్లియర్ చేసిన తర్వాతే యాత్రికులను ఆ మార్గంలో కేదార్‌నాథ్ పంపించనున్నారు. కాలినడకన వెళ్లే వారు సోన్‌ప్రయాగ్, గౌరికుండ్ వద్ద నిలిచిపోయారు.

సీఆర్‌పీఎఫ్ కోబ్రాకు తొలి మహిళా ఐజీగా సంజుక్తా



న్యూఢిల్లీ : సెప్టెంబర్ 15: (మహాప్రభ)
ఐపీఎస్ అధికారి సంజుక్తా పరాశర్‌ను సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ప్రత్యేక జంగిల్ వార్‌ఫేర్ కమాండో విభాగం 'కోబ్రా'కు ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ)గా నియమించారు. ఈ పదవిని చేపట్టనున్న తొలి మహిళగా ఆమె నిలిచారు. సంజుక్తా పరాశర్ 2006 బ్యాచ్‌కు చెందిన అసోం- మేఘాలయ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఈ మేరకు కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) ప్రధాన కార్యాలయం గతవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి దానేశ్ రాణా స్థానంలో ఆమె 'కమాండో బెటాలియన్ ఫర్ రెజల్యూట్ యాక్షన్'(కోబ్రా) ఐజీగా బాధ్యతలు చేపట్టనున్నారు. 'పది బెటాలియన్లతో కూడిన సీఆర్‌పీఎఫ్ కోబ్రాకు ఒక మహిళా అధికారి నాయకత్వం వహించడం ఇదే తొలిసారి అని ఓ సీనియర్ అధికారి 'పీటీఐ'కి తెలిపారు. భారత్‌లోని పలు రాష్ట్రాల్లో వామపక్ష తీవ్రవాదం(ఎల్‌డబ్ల్యూఈ), ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో తిరుగుబాటు కార్యకలాపాలను ఎదుర్కొనేందుకు సీఆర్‌పీఎఫ్ 2008-09లో 'కోబ్రా'ను ఏర్పాటు చేసింది

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రండి

(మొదటి తరువాయి)

జాజు, సీఎం సలహాదారు రామకృష్ణారావుతో పాటు పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, అగా ఖాన్ ఫౌండేషన్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 తండ్రి, దివంగత ఆగా ఖాన్-4 మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరపున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు సీఎం గుర్తుచేశారు. ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు.

మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి

మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసా, మూసా నదుల సంగమంగా ఏర్పడిన మూసీ ఆక్రమణలకు గురి కావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో ఆగా ఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుతం ఉన్న ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా గుర్తించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5 ఆసక్తి

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీపై ప్రిన్స్ రహీమ్ అగా ఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందు కోసం సింగపూర్ కంపెనీ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందని వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్-జీరో సిటీగా ఏర్పాటు చేస్తామని, దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఉంటుందని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు తెలిపారు. ఇప్పటికే అమెజాన్ వంటి ప్రముఖ సంస్థలు ఫ్యూచర్ సిటీలో తమ కార్యకలాపాలను ప్రారంభించాయని సీఎం వెల్లడించారు.

నేడు 22ఎపై అసెంబ్లీలో కీలక చర్చ

(మొదటి తరువాయి)

ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరుపై చర్చ జరిగినట్టు తెలిసింది. 22ఏ నిషేధిత జాబితా వల్ల సామాన్య ప్రజలకు కలిగిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసే అవకాశమున్నది. ఉద్దేశపూర్వకంగానే ప్రజల భూములు, ఆస్తులను 22ఏ పరిధిలో చేర్చినట్టు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో స్పందించే అవకాశమున్నది. ప్రతిపక్షాలకు సమాధానం చెప్తారని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడతారు, ఏం ప్రకటన చేస్తారనే దానిపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. 22ఏ వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఏమైనా ఉపశమనం కలుగుతుందా?అన్నదాని కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకోవైపు ధరణి పోర్టల్‌లో లోపాల వల్ల బీఆర్ఎస్ హయాంలో భారీగా భూదందాలు జరిగాయనే దానిపై సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వివరించనున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మాజీమంత్రి హరీశ్‌రావు, అతని మామ భూబదలాయింపులను ప్రోత్సహించిన అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నేతల అక్రమ భూదందాలపై విచారణకు అదేశించే అవకాశం లేకపోలేదని తెలుస్తున్నది. ఇప్పటికే ధరణి అక్రమాలపై సెట్ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ధరణిపై ప్రభుత్వం ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించింది. ఆ నివేదికను ఇంకా బహిర్గతం చేయలేదు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చే అవకాశముందని తెలిసింది. దీంతో అందరి చూపు బుధవారం జరిగే అసెంబ్లీ సమావేశాలపైనే ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. 22ఏ అంశంపై చర్చ ముగిసిన అనంతరం ఎల్‌నినో ప్రభావంపై లఘు చర్చ ఉంటుందని అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి తెలిపారు

మసూద్ అజర్‌పై పాక్ నజరానా పెంపు

ఇస్లామాబాద్



జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్ ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే నజరానాను పాక్ ప్రభుత్వం రూ.24 లక్షలకు పెంచింది. అజర్ 2021లో అఫ్ఘనిస్థాన్‌కు పారిపోయాడని తన కొత్త రెడ్ బుక్‌లో పాక్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ తెలిపింది. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) అక్టోబర్‌లో సమావేశం కానున్న నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకున్నది. పాక్ నజరానా పెంపుపై భారత్ స్పందిస్తూ.. ఇలాంటి మోసపు ప్రకటనలను ఆ దేశం గతంలో కూడా చేసిందని విమర్శించింది. గతంలో ఎఫ్ఏటీఎఫ్ పాకిస్థాన్‌ను గ్రే లిస్ట్‌లో ఉంచింది.ఉగ్రవాదానికి ఆర్థిక సాయంపై, మనీ లాండరింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆ సమయంలో పాక్‌పై ఒత్తిడి తెచ్చింది. మళ్లీ ఇప్పుడు అలాంటి ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పాక్ అజర్‌పై ఉన్న నజరానాను పెంచింది. 2016 పఠాన్ కోట్, 2019లో పుల్వామా దాడుల్లో అజర్ నిందితుడిగా ఉన్నాడు.

కేంద్రం ఒత్తిడికి తలవంచిన మెటా

న్యూఢిల్లీ



భారత్‌లో పిల్లల ఆన్‌లైన్ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా సోషల్ మీడియా దిగ్గజం మెటా కీలక నిర్ణయం తీసుకుంది. తన ప్లాట్‌ఫామ్‌లపై గుర్తించే పిల్లల భద్రతకు సంబంధించిన కేసులు, ముఖ్యంగా బాలల లైంగిక వేధింపులు, దుర్వినియోగానికి సంబంధించిన ఘటనలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు నివేదించేందుకు మెటా అంగీకరించింది. మెటా యాజమాన్యంలోని ప్లాట్‌ఫామ్‌లలో చిన్నారుల లైంగిక వేధింపులు, దోపిడీకి సంబంధించిన కంటెంట్, ప్రకటనలు వస్తున్నట్లు వార్తలు రావడంతో కేంద్రం, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించాయి.

హానికరమైన కంటెంట్‌ను ముందుగానే గుర్తించి తొలగించడంతో పాటు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని చట్ట అమలు సంస్థలకు అందించాల్సిన బాధ్యతను కూడా ప్రభుత్వం నొక్కిచెబుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై ఉక్కుపాదం మోపుతోంది. దాంతో మెటా ఇకపై పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలోని సైబర్ క్రైమ్ పోర్టల్‌కు నేరుగా నివేదించనుంది. ఇటీవల మెటా ప్రతినిధులు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ముందు హాజరయ్యారు. ఇన్‌స్టాగ్రామ్‌లో బాలల లైంగిక దోపిడీకి సంబంధించిన కంటెంట్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణ జరిగింది. ఈ పరిణామాల మధ్య మెటా తాజాగా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పిల్లలకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించేందుకు ఇది ప్రారంభ అడుగు మాత్రమేనని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు కూడా పిల్లల భద్రతకు సంబంధించి మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని కేంద్రం కోరుతోంది.

భారత్‌దే సిరీస్

-రెండో టీ20లోనూ ఆఫ్ఘనిస్తాన్ చిత్తు
- విజృంభించిన నితీష్, అర్ష్‌దీప్
- సంజూ, అభిషేక్ మెరుపులు
-7 వికెట్లతో టీమిండియా ఘన విజయం



న్యూఢిల్లీ

ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో సూపర్ విక్టరీ సాధించిన టీమిండియా.. మంగళవారం జరిగిన రెండో టీ20లోనూ అదే జోరు కొనసాగిస్తూ ఆఫ్ఘనిస్తాన్‌ను 7 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్.. భారత బౌలర్లు నితీష్ కుమార్ రెడ్డి (3/24), అర్ష్‌దీప్ సింగ్ (2/35) ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేసింది. ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్లలో కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ (37), రషీద్ ఖాన్ (28), రసూలీ (26) రాణించారు. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని భారత్.. 14.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. సంజూ శాంసన్ (57; 22 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు) హ్యాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఇక రేపు (గురువారం) మధ్య నామమాత్రపు మూడో టీ20 జరగనుంది.

ఓపెనర్ల విధ్వంసం..

లక్ష్యఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ విధ్వంసకర ఆరంభాన్ని అందించారు. తొలి బంతి నుంచే చెలరేగి ఆడిన వీరు ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడి తొలి వికెట్‌కు కేవలం 38 బంతుల్లోనే 88 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం ధాటిగా ఆడుతున్న అభిషేక్ శర్మ (38; 19 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లు) రషీద్ ఖాన్ బౌలింగ్‌లో వెనుతిరిగాడు. తర్వాత ధనాధన్ బ్యాటింగ్‌తో కేవలం 20 బంతుల్లోనే అర్ధ శతకం బాదేసిన శాంసన్ (57) కూడా చివరికి రషీద్ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. అనంతరం కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (11) విఫలమైనా.. ఇషాన్ కిషన్ (38 నాటౌట్), తిలక్ వర్మ (15 నాటౌట్) చివరి వరకు అజేయంగా నిలిచి టీమిండియాను విజయతీరాలకు చేర్చారు. ఆఫ్ఘన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు.

విజృంభించిన తెలుగుకుర్రాడు..

అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు భారత యువ పేస్ ఆల్‌రౌండర్, తెలుగుకుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి నిప్పులు చెరిగే బంతులతో హడలెత్తించాడు. ఓపెనర్ గుర్బాజ్ (0)ను అర్ష్‌దీప్ డకౌట్ చేయడంతో ఆఫ్ఘన్ పరుగుల ఖాతా తెరవకుండానే తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత మరో ఓపెనర్, కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్.. సిదిఖుల్లా అటల్ (12)తో కలిసి రెండో వికెట్‌కు 51 పరుగులు జోడించాడు. ఈ దశలో బంతి అందుకున్న నితీష్ కళ్లు చెదిరే బంతితో కేలక ఇన్నింగ్స్ ఆడుతున్న ఇబ్రహీం (37)ను వెనక్కి పంపించాడు. తర్వాత గుల్బదీన్ నైబ్ (10)ను కూడా బౌల్డ్ చేసి ఆఫ్ఘనిస్తాన్‌కు మరో భారీ షాకిచ్చాడు. ఈ క్రమంలోనే సిదిఖుల్లాను రవి బిష్ణోయ్.. ప్రమాదకరమైన అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (11)ను అక్షర్ పటేల్ ఇంటిబాట పట్టించారు. అనంతరం ధాటిగా ఆడుతున్న రసూలీ (26)ను అర్ష్‌దీప్ సింగ్ బౌల్డ్ చేయడంతో ఆఫ్ఘన్ 100 పరుగుల వద్ద 6 వికెట్లు కోల్పోయింది. అయితే, ఆఖరిలో ఆల్‌రౌండర్లు రషీద్ ఖాన్ (28), మొహమ్మద్ నబీ (20) రాణించడంతో ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత ఓవర్లలో 159/8 స్కోరు సాధించింది. భారత బౌలర్లలో నితీష్ కుమార్ రెడ్డి 3 వికెట్లతో విజృంభించగా.. అర్ష్‌దీప్ సింగ్ 2 వికెట్లతో సత్తా చాటాడు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్

(మొదటి తరువాయి)

ఉండనున్నట్లు తెలుస్తోంది. యువతతో నేరుగా మమేకమయ్యే కార్యక్రమాలను కాంగ్రెస్ ఇప్పటికే ప్రారంభించింది. సెప్టెంబర్ 19న ఇండోర్‌లో రాహుల్ గాంధీ పాల్గొనే యువజన కార్యక్రమం కూడా ఈ వ్యూహంలో భాగం గా భావిస్తున్నారు. మరోవైపు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహం, రాష్ట్రాల వారీగా పార్టీ బలోపేతంపై ప్రియాంకాగాంధీకి కీలకపాత్ర అప్పగించే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగు తోంది. ఎన్నికల సమయంలో ప్రచారంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేయడంలో ప్రియాంక కు ఇప్పటికే విస్తృత అనుభవం ఉంది. 2029లో రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన కాంగ్రెస్‌లో బలపడుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను కూడా 2029 వ్యూహానికి ముందస్తు పరీక్షగా కాంగ్రెస్ భావిస్తోంది. రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గేలను విస్తృతంగా ప్రచారంలోకి దించేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

సంస్థాగత పునర్నిర్మాణానికి ప్రాధాన్యం

ప్రాథమిక దశగా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శుల నియామకంపై పార్టీ దృష్టి కేంద్రీకృతమై ఉంది. రాష్ట్రాలవ్యాప్తంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలకు బాధ్యత వహించే 65కు పైగా కార్యదర్శి పదవుల కోసం కఠినమైన పరిశీలన జరుగుతోంది. చారిత్రాత్మకంగా బలహీనమైన సంస్థాగత నిర్మాణాలున్న ప్రాంతాలకు.. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర వంటి కీలక రాష్ట్రాలకు నాయకత్వం ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 2029లో వాస్తవిక విజయం సాధించాలంటే ఈ పోరాట క్షేత్రాలలో బలమైన ప్రదర్శన అత్యంత కీలకమని నాయకత్వం గుర్తిస్తోంది. యువ నాయకత్వ శ్రేణికి మార్గం సుగమం చేస్తూ, అభ్యర్థుల కార్యచరణ సామర్థ్యం, జెన్ జెడ్ ఓటర్లతో మమేకమయ్యే వారి ప్రతిభ ఆధారంగా వారిని మూల్యాంకనం చేస్తున్నారు.

రాహుల్‌కు ప్రజా చేరువ.. ప్రియాంకకు సంస్థాగత వ్యూహం

సంస్థాగత మార్పులకు అతీతంగా ప్రియాంక గాంధీ వాద్రాకు విస్తృతమైన, నిర్దిష్టమైన వ్యూహాత్మక పాత్రను అప్పగించనున్నట్లు ఇటీవలి పార్టీ చర్చలు సూచిస్తున్నాయి. ఆమె ప్రమేయాన్ని పెంచాలన్న దీర్ఘకాల అంతర్గత విజ్ఞప్తులకు స్పందిస్తూ, 2029 ఎన్నికల కోసం ఒక ఎన్నికల నిర్వహణ వ్యూహ బృందాన్ని ఏర్పాటు చేయాలని పార్టీ యోచిస్తోంది. దీనికి ప్రియాంక నాయకత్వం వహించనున్నట్లు సమాచారం. ఈ ప్రతిపాదిత కమిటీలో ముకుల్ వాస్నిక్, అశోక్ గెహ్లోట్ వంటి అనుభవజ్ఞులైన వ్యూహకర్తలతో పాటు కొత్త, యువతరం నాయకులు కూడా ఉంటారని భావిస్తున్నారు. రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతను చేరుకోవడంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ దేశవ్యాప్తంగా ప్రజా రక్షణగా కొనసాగుతుండగా.. ప్రియాంక గాంధీ వాద్రా బాధ్యతలు పార్టీ ప్రతిష్టను పెంచడం, ప్రచారాన్ని మెరుగుపరచడం, వ్యూహాలను అమలు చేయడంపై కేంద్రీకృతమై ఉంటాయి. 2024లో వాయనాడ్ నుంచి లోక్‌సభ స్థానాన్ని గెలుచుకుని, క్రియాశీల పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు. ఆమె కీలకమైన పరిశీలన కమిటీలను, రాష్ట్ర ప్రచార పునర్వ్యవస్థీకరణలను నిర్వహించి పార్టీపై పట్టు సాధించారు. ఉదాహరణకు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు అభ్యర్థుల జాబితాలను సిద్ధం చేయడం, స్థానిక పునర్వ్యవస్థీకరణలకు నాయకత్వం వహించడం వంటివి చేశారు. ఈ ముందస్తు సమీకరణ, 2029 ఒక నిజమైన సువర్ణావకాశాన్ని అందిస్తోందన్న కాంగ్రెస్ భావనను ప్రతిబింబిస్తోంది. కీలకమైన సీట్లను దక్కించుకోవడానికి పూర్తిగా ప్రాంతీయ సంకీర్ణ మిత్రపక్షాలపై ఆధారపడకుండా, పార్టీ తన స్వతంత్ర సంస్థాగత ఉనికిని బలోపేతం చేసుకోవాలన్న రాహుల్ గాంధీ అభిప్రాయం ఈ ప్రయత్నాలకు తోడై శక్తిగా ఉంది. గత ఎన్నికలలో ఓటర్ల స్పందనను ప్రభావితం చేసిన లోపాలను సరిదిద్దుకోవడం ద్వారా రాహుల్ బహిరంగంగా, ప్రియాంక వ్యూహాత్మకంగా తోడ్పడే ఉమ్మడి ద్వంద్వ నాయకత్వ నమూనా, అధికారంలో ఉన్న బీజేపీ ఎన్నికల అప్రతిహతాన్ని సవాలు చేయగల పటిష్టమైన పార్టీ నిర్మాణాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

భూభారతి కాదు..భూహారతి

(మొదటి తరువాయి)

ప్రస్తుతం యజమానులకు సమాచారం లేకుండానే ఆస్తులు నిషేధిత జాబితాలో చేరుతున్నాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూభారతి' పేరే తప్ప, వాస్తవానికి అది 'భూహారతి'గా మారిందని ఆయన విమర్శించారు. అడ్డగోలు విధానాలను వెంటనే నిలిపివేసి ధరణి పోర్టల్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికలకు ముందు ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించి యాజమాన్య హక్కులు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇచ్చే పేరుతో ముందుగానే ఒప్పందాలు కుదుర్చుకుని వందల, వేల కోట్ల రూపాయలు దండుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం చెప్పని మాటలను తమకు ఆపాదిస్తూ వక్రీకరణకు పాల్పడుతోందని విమర్శించారు. తమ పార్టీ నాయకుడి మరణాన్ని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడారని, ముఖ్యమంత్రి ప్రోద్బలంతోనే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా తాము ఆందోళన చేపట్టామని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రధాన ప్రతిపక్షానికి ఉందని స్పష్టం చేశారు.ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పే సత్తా, సమర్థత ప్రభుత్వానికి లేకపోవడంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. సస్పెన్షన్‌తో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతిరోజూ ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల భూ వ్యవహారాలు, 22ఏ పేరుతో జరుగుతున్న అక్రమాలు, 30 శాతం కమీషన్లు, ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలను ప్రజల ముందు నిరంతరం బహిర్గతం చేస్తామని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవహారాలను వెలుగులోకి తీసుకువచ్చి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

(మొదటి తరువాయి)

అమలు చేయడంలో మాత్రం జాప్యం చేస్తోందని విమర్శించింది. పీఆర్సీ గడువు ముగిసే దశకు చేరుకుంటున్నా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనకు కారణమవుతోందని తెలిపింది. పెరుగుతున్న ధరలు, కుటుంబ అవసరాలు, జీవన వ్యయం నేపథ్యంలో ఉద్యోగులకు వేతన సవరణ ఎంతో అవసరమని పేర్కొంది. ప్రభుత్వం ఉద్యోగుల ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని తక్షణమే పీఆర్సీపై నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం ద్వారా వారి వేతన సవరణకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులు ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారి సేవలు ఎంతో ముఖ్యమని తెలంగాణ రక్షణ సేన తెలిపింది. అలాంటి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరికాదని పేర్కొంది. పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుని వాటిని అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన కోరింది. హామీలను ప్రకటించి వాటి అమలులో వెనుకడుగు వేయడం వల్ల ఉద్యోగుల్లో ప్రభుత్వంపై నమ్మకం తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. మాటలకే పరిమితం కాకుండా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేసింది. పీఆర్సీ గడువు ముగిసిన తర్వాత కూడా నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగితే ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ రక్షణ సేన ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్ల ఎలాంటి ఆలస్యం లేకుండా 51 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరింది.

యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు..

(మొదటి తరువాయి)

యూపీఐ లావాదేవీలపై వసూలు చేసే ఛార్జీలపై కేంద్రం స్పష్టతనిచ్చింది. రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలు వసూలు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఎండీఆర్ (మర్చంట్ డిస్కౌంట్ రేట్)గా పిలిచే ఈ ఛార్జీలు వ్యాపారులు మాత్రమే చెల్లించాలి. వినియోగదారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అంశంపై ఎన్‌పీసీఐ (ద నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కీలక వివరాల్ని వెల్లడించింది.దీని ప్రకారం వచ్చే అక్టోబర్ 15 నుంచి ఈ ఛార్జీలు అమలులోకి వస్తాయి. యూపీఐ నుంచి మర్చంట్స్‌కు చేసే చెల్లింపులపైనే ఈ ఎండీఆర్. అలాగే, యూపీఐ నుంచి బ్యాంకులకు, యూపీఐ అకౌంట్లకు చేసే చెల్లింపులు ఎప్పట్లాగే ఉచితం. నిబంధనల ప్రకారం అర్హులైన వ్యాపారులకే ఇది వర్తిస్తుంది. అలాగే, కొన్ని చిన్న వ్యాపారాలు, ప్రత్యేక, అత్యవసర సేవలకు ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. ఈ ఛార్జీలకు సంబంధించి వినియోగదారులకు ఎలాంటి భారం పడదు. రూ.2,000 దాటి చేసే యూపీఐ చెల్లింపులపై, ప్రతి లావాదేవీపై 0.4 శాతం ఎండీఆర్‌ను వ్యాపారులే చెల్లించాలి. గరిష్టంగా రూ.300 వరకే ఉంటుంది. సగటు ఛార్జీలు ఇలా ఉంటాయి. రూ.3,000 లావాదేవీపై రూ.12, రూ.50,000 లావాదేవీపై రూ.200, రూ.75,000 లావాదేవీపై రూ.300 డీపీఆర్ చెల్లించాలి. రూ.75,000 దాటినా సరే.. గరిష్టంగా ఒక లావాదేవీపై రూ.300 మాత్రమే ఛార్జీ ఉంటుంది. ఎన్‌పీసీఐ చెబుతున్న వివరాల ప్రకారం 95 శాతం యూపీఐ లావాదేవీలు రూ.2,000 కంటే తక్కువగానే ఉంటున్నాయి. అందువల్ల 5 శాతం లావాదేవీలపైనే ఈ ఛార్జీలు ఉంటాయి. వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులకు ఈ విషయంలో పీ2పీఎం కింద మినహాయింపు ఉంటుంది. అలాగే, క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు రూ.1 లక్ష లావాదేవీ దాటిన వాటిపైనే ఎండీఆర్ చార్జీలుంటాయి. అది రూ.లక్ష లావాదేవీ మూడు నెలలు వరుసగా దాటితే వారిని పెద్ద వ్యాపారులుగా పరిగణిస్తారు.

అంతరిక్షంలో మా వద్ద ఆయుధాలున్నాయ్..

న్యూఢిల్లీ



అంతరిక్షం లో తమ వద్ద ఆయుధాలు ఉన్నాయని అమెరికా తొలిసారి బహిరంగంగా ప్రకటించింది. ఇప్పటికే కొన్ని 'స్పేస్ కంట్రోల్ వెపన్స్ కక్ష్యలో ఉన్నాయని అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. శత్రు దేశాల దాడుల నుంచి అమెరికా, మిత్రదేశాల బలగాలను రక్షించేందుకే వీటిని మోహరించినట్లు తెలిపింది. అయితే ఆయుధాల సంఖ్య, వాటి స్థానం, ఏ తరహా వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్న వివరాలను మాత్రం బయటపెట్టలే

సంపాదకీయం

వివక్ష విహారం



స్వామి వివేకానంద ఆనాడు చికాగోలో జరిగిన ఆధ్యాత్మికుల సభలో ప్రసంగించి అందరినీ అబ్బుర పరిచారని మనందరికి తెలుసు. సంబోధనలోనే 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అని ఒక ఉన్నతమైన పిలుపుతో అందరి మనసులు గెలుచు కున్నాడని విన్నాము. భారతదేశపు గౌరవ మర్యాదలు, సంప్రదాయాలు, విలువల గురించి ఆయన ప్రసంగం ప్రస్ఫురించిందని విమర్శకులు అభిప్రాయ పడి, ఆయన్ను కొనియాడారు. అట్లాంటి చరిత్రను చెరిపిరాసేందుకు పూను కుంటున్నాయి నేటి మతవాదుల చర్యలు. భక్తి, ఆరాధన వ్యక్తిగతమైన విషయాలు. అవి ఎలా చేసుకున్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఇప్పుడు ఏం జరిగింది. ఏం జరుగుతోంది? మన దేశ ఉన్నత్యాన్ని దెబ్బతీసే పనులకు మత ప్రచారకులు, ప్రవచనకారులూ ఒడిగడుతున్నారు.మొన్న సెప్టెంబరు 5న ఫ్రాన్స్‌లోని పారిస్ నగరంలో జరిగిన సంఘటన మతవాదుల వివక్షతలను వెల్లడిస్తోంది. వివక్షా పూరిత వీరి ప్రవర్తనకు పారిస్‌లోని ప్రసిద్ధ పర్యటన కట్టడం ఈఫిల్ టవర్‌ను ఒకరోజు మూసేసారు. అసలేం జరిగిం దంటే, బాబ్స్ అనే ఒక హిందూ ధార్మిక సంస్థ (బొచాసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ్ సంత) సభ్యులు ఒక వంద మంది కాషాయ వస్త్రాలు ధరించి, ఈఫిల్ టవర్ సందర్శనకు వెళ్లారు. అందులో వారి గురువు కూడా ఉన్నాడు. అందరు పర్యటించినట్లే వాళ్లూ పర్యటిస్తే ఇంత చెప్పుకునేవాళ్లం కాదు. ఆ ఈఫిల్ టవర్‌లో వందలాదిమంది ఉద్యోగులు పనిచేస్తారు. అందులో మహిళలూ ఉంటారు. మన హిందూ సాధు సన్యాసులు, అక్కడ మహిళా ఉద్యోగులను వారికి కనపడకుండా తప్పుకోవాలని కోరారు, వారు పనిచేస్తున్న ప్రదేశంలో పురుష ఉద్యోగులను ఉంచాలని, మేము మహిళలను చూడకూడదని వీరి వివక్షాపూరిత ఆచారాన్ని అక్కడ అమలు చేయటానికి సిద్ధపడ్డారు. ఈఫిల్ టవర్ యాజమాన్యం వారి కోరిక మేరకు తప్పుకోవాల్సిందిగా కోరింది. మహిళలను వారు చూస్తే మలిన పడిపోతారని వారి భావం, పాపమై పోతుందనే ఉద్దేశం, అక్కడ మహిళా ఉద్యోగులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఒక విదేశీ గడ్డపైన మన మత ఆచారాలు ఎంత వివక్ష పూరితంగా ఉంటాయో ప్రపంచానికి చాటి చెప్పినట్లయింది. వెంటనే అక్కడ పనిచేస్తున్న ఉద్యోగ సంఘాలు వీరి ప్రవర్తనకు నిరసనగా ఒక రోజు సమ్మెకు దిగడంతో సెప్టెంబరు 7న ఈఫిల్ టవర్ సందర్శనను నిలిపివేశారు. ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, అంతకుముందు రోజు పారిస్‌లో బాబ్స్ అనే సంస్థ నిర్మించిన దేవాలయ ప్రారంభోత్సవానికి మన ప్రధాని మోడీ హాజరయ్యారు. భారత్, ఫ్రాన్స్ సాంస్కృతిక సంబంధానికి ఇదొక ప్రతీక అని, ఈ సంబంధాల బలోపేతానికి కృషి చేయాలని కోరి ఉన్నారు. ఆ వెనువెంటనే ఈ సంఘ టన చోటు చేసుకున్నది. ఉద్యోగులు చేసిన సమ్మెతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, జరిగిన దానిపై దర్యాప్తు చేస్తున్నది. టవర్ ఆపరేటింగ్ కంపెనీ పొరపాటు చేసిందని, దేశం అవలంబిస్తున్న సమానత్వ, గణతంత్ర విధానాలకు వ్యతిరేకమైన చర్య ఇదని, లింగ వివక్షతను అనుమతించబోమని ఫ్రాన్స్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంఘటనను ఫ్రెంచ్ రాజకీయ నాయకులు, అధికారులు ఖండించారు. ఇంత పెద్ద దుమారం రేగగానే సదరు 'బాబ్స్' సంస్థ క్షమాపణలు కోరింది. ప్రపంచంలో మన ఆచరణ, మహిళల పట్ల వివక్షత, అసమానతలు ఏ విధంగా ఉన్నాయో బహిరంగ పరిచారు. ఇవి మనకు తలవంపులు తెచ్చే విధంగా ఉన్నాయి. స్త్రీల పట్ల మతతత్వవాదులు ఈ దేశంలోనే కాదు, ఇతర దేశాలలోనూ అదే రకమైన ఆచరణ, ఆలోచన కొనసాగుతుంది. దీన్ని ఇప్పుడు కూడా మన దేశంలోని మతవాదులు కానీ, పరిపాలిస్తున్న నాయకులు కానీ ఖండించరు. వీరి మత ఛాందస విధానాలు, మన దేశంలో కులపరంగానూ దుర్మార్గమైన వివక్షతలను పాటిస్తున్నారు. వాళ్లూ సనాతనవాదం గురించి మాట్లాడుతున్నారు. మహిళలను చిన్నచూపు చూసిన బాబ్స్ సంస్థ 18 శతాబ్దం నుండే పనిచేస్తున్నది. గుళ్లలోకి మహిళలను రానియ్యని ఆచరణ వాళ్లది. ఇలాంటి ప్రచారకులకు, బోధకులకు మన విశ్వగురువు నాయకుడు. ఆధునిక ప్రజాస్వామిక, లౌకిక విధానాలకు పూర్తి విరుద్ధమైన ఆలోచనలతో నడుస్తున్న తీరును చూసి ప్రపంచమంతా నవ్వుతున్నది. ప్రపంచంలోనే మొట్ట మొదటి రాజకీయ విప్లవం సాధించిన 'పారిస్ కమ్యూన్'లో మహిళలు స్వేచ్ఛ కోసం వీరోచితంగా పోరాడిన నేలలో లింగ వివక్షతలకు పాల్పడడం క్షమించరాని నేరం. చైతన్యయుతమైన అక్కడి మహిళలు తమ ప్రతిఘటనను ప్రదర్శించారు

చర్చల పేరుతో కాలయాపన వద్దు.. ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

-ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా.. ప్రభుత్వంపై నేతల ఆగ్రహం





సెప్టెంబర్ 15 మహాప్రభ దేవరకద్ర

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఆటో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ ధర్నా కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాష్ట్ర నాయకులు హాజరై ఆటో కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆటో కార్మికులు నిత్యం ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నప్పటికీ, వారి సంక్షేమం కోసం సమగ్ర చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో సమయం గడపకుండా వెంటనే ఆటో జేఏసీ ప్రతినిధులతో చర్చించి, సంక్షేమ బోర్డు ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా జేఏసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. రాముతో పాటు ఆటో జేఏసీ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు

కాంగ్రెస్ లో చేరిన ముదేలి సర్పంచ్ లక్ష్మణ్



గాంధారి, సెప్టెంబర్ 15: (మహాప్రభ)

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో గాంధారి మండలం ముదేలి గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ సర్పంచ్ లక్ష్మణ్ కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, గ్రామాల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధకు ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే నాయకత్వంలో ముదేలి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు.

'మా తండా.. మా రాజ్యం' కలను సాకారం చేసింది కేసీఆర్





-గిరిజనుల హక్కులు, సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

-దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 15 మహాప్రభ

భూత్పూర్, : తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు సెప్టెంబర్ 17 ప్రత్యేకమైన రోజని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. భూత్పూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల రిజర్వేషన్లను ఆరు నుంచి పది శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు కోరుతున్న తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాలనే డిమాండ్‌ను కేసీఆర్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. 'మా తండా.. మా రాజ్యం' అనే గిరిజనుల కలను సాకారం చేస్తూ రాష్ట్రంలో నాలుగు వేలకు పైగా తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారని తెలిపారు. 500 కంటే తక్కువ జనాభా ఉన్న తండాలను సైతం గిరిజనుల డిమాండ్ మేరకు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గిరిజన సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 17న దేవరకద్ర నియోజకవర్గంలోని గిరిజన తండాల్లో ర్యాలీలు నిర్వహించి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయనున్నట్లు వెల్లడించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలు, ఇప్పటివరకు అమలు చేసిన హామీలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో వెల్లడిస్తూ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఎస్టీలకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తండాలకు రోడ్ల నిర్మాణం కోసం తమ హయాంలో రూ.12 కోట్లు తీసుకొచ్చామని తెలిపారు. అయితే, మూడేళ్లు గడిచిన తర్వాత కూడా తాము మంజూరు చేయించిన పనులనే ప్రారంభిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్రీశైలం నుంచి నీటిని ప్రభుత్వం సక్రమంగా ఎత్తిపోసుకోకపోవడంతో సాగునీటి పరిస్థితి దెబ్బతింటోందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కందూరు పెద్దవాగు ఎడారిని తలపించే పరిస్థితికి చేరుకుందని విమర్శించారు.ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు.

శంకర్ నగర్లో ఘనంగా గణేష్ సురక్షా సంకల్ప్ ప్రోగ్రాం..



సెప్టెంబర్ 15 (మహాప్రభ) హైదరాబాద్

గణేష్ సురక్షా సంకల్ప్ 2026 కార్యక్రమంలో భాగంగా, మేడిపల్లి పోలీస్ స్టేషన్ వారు 16.09.2026 తేదీన సాయంత్రం 7 గంటలకు పీర్జాదిగూడలోని శంకర్ నగర్ కాలనీలో మాదకద్రవ్యాలు మాకొద్దు అని చెప్పండి" అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ డీసీపీ, మేడిపల్లి ఏసీపీ మోహన్ కుమార్, ఈగిల్ టీమ్ ఇన్‌స్పెక్టర్, మేడిపల్లి ఎస్‌హెచ్‌ఓ జలెందర్, ఉప్పల్ ఎస్ఐ, పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు, పీర్జాదిగూడలో నివసిస్తున్న సహకారిలు, శ్వేత, అన్నపూర్ణ, సుజాత, ప్రణతి, రాజిత తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాలనీ నివాసితులు (200 మంది) చురుకుగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు తమ ప్రాంతంలో మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను నివారించాల్సిన ఆవశ్యకత గురించి వారికి అవగాహన కల్పించారు. అంతేకాకుండా, తమ పరిసర ప్రాంతాలలో మాదకద్రవ్యాలకు సంబంధించిన సమస్యలను గుర్తించి, నివారించడానికి పోలీస్ శాఖకు సహకరించాలని నివాసితులను సిఐ జలెందర్ రెడ్డి కోరారు.

గిరిజనులకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

-మాజీ మంత్రి సూర్యపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి



దేవరకొండ సెప్టెంబర్ 15 (మహాప్రభ)

రాష్ట్రం లో గిరిజనులకు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది మాజీ మంత్రి కేసీఆర్ రే అని మాజీ మంత్రి వర్యులు సూర్యాపేట శాసన సభ్యులు శ్రీ జగదీశ్వర్ రెడ్డి అన్నారు మంగళవారం దేవరకొండ నియోజక వర్గం లో మాజీ శాసన్ సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అధ్యక్షతన వారి నివాసం లో ఏర్పాటు చేసిన గిరిజనుల ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనులకు పెద్దపీట వేసింది కెసిఆర్ గారే అని . గిరిజనులకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్లు పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారికే దక్కుతుందని అన్నారు .500 గల జనాభా కలిగిన తండాలను గుర్తించి గ్రామపంచాయితీలుగా మార్చి గిరిజనులకు వారి తండాలలో వారే పరిపాలన చేసుకునెటట్లు గ్రామపంచాయతీలు గా చేసి వారి కి రాజకీయాల్లో గుర్తింపు తెచ్చేలా చేసింది తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని అన్నారు . గిరిజనులు బి.ఆర్ ఎస్.పార్టీ అండగా ఉండాలని 17వ తేదిన అన్ని తండాలలో మన భావు కేసిఆర్ కి పాలాభిషేకం చేయాలని పిలుపునిచ్చారు

ప్రతి తండాలో ర్యాలీ.. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం





- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ సెప్టెంబర్ 15 (మహాప్రభ)
తెలంగాణలో గిరిజన తండాలు, గూడేలకు ప్రత్యేక గ్రామ పంచాయతీ హోదా కల్పించి, గిరిజనులకు స్వపరిపాలనను అందించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దేనని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.మంగళవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన దేవరకొండ నియోజకవర్గ ఎస్.టి. ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .....గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీది అని ఆయన అన్నారు.2018లో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4,383 కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా, సుమారు 3,146 తండాలు, గూడేలు స్వతంత్ర గ్రామ పంచాయతీలుగా అప్‌గ్రేడ్ అయ్యాయని తెలిపారు. 500కు పైగా జనాభా కలిగి, అప్పటికే ఉన్న గ్రామ పంచాయతీ కేంద్రానికి 1.5 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న తండాలు, గూడేలు, ఆవాసాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు.తండా గ్రామ పంచాయతీగా మారడంతో గిరిజనులకు సొంత సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యాలయం, నిధులు, స్థానిక అభివృద్ధిపై నిర్ణయాధికారం లభించిందన్నారు. 3,146 మంది సర్పంచులు, 24,682 మంది వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులుగా ఏర్పడి గ్రామస్థాయి పరిపాలనలో గిరిజనులకు భాగస్వామ్యం కల్పించారని ఆయన తెలిపారు.ప్రత్యేక గ్రామ పంచాయతీల ద్వారా అంతర్గత రహదారులు, వీధి దీపాలు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర మౌలిక వసతులపై స్థానికంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడిందన్నారు. తండాలు పెద్ద గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న సమయంలో ఎదురైన పరిపాలనా నిర్లక్ష్యానికి ఇది శాశ్వత పరిష్కారం చూపిన సంస్కరణ అని రవీంద్ర కుమార్ అన్నారు.కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎస్.టి. స్టేషత్ డిమలంఫ్ మెటు పండస్ కు చట్టబద్ధత కల్పించిందని తెలిపారు. 2022--23లో రూ.13,412.63 కోట్లు, 2023--24లో రూ.15,232.62 కోట్లకు నిధులను పెంచినట్లు పేర్కొన్నారు.గిరిజన రైతులకు సాగుభూముల అభివృద్ధి కోసం గిరి వికాసం పథకం ద్వారా వేలాది మంది రైతులకు ప్రయోజనం కల్పించారని తెలిపారు.గిరిజన విద్యార్థుల కోసం నూతన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఐ ఐ టి-- ఎన్ఇఇ టి కోచింగ్, స్టారస్ వంటి కార్యక్రమాలను చేపట్టడంతో పాటు, .2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనుల కోసం అనేక హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.ప్రతి గూడెం, తండా గ్రామ పంచాయతీకి ఏటా రూ.25 లక్షలు కేటాయిస్తామని, కొత్త గిరిజన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కో కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల చొప్పున నిధులు ఇస్తామని, కొత్త ఐటి డి. ఎలు ఏర్పాటు చేస్తామని, గిరిజన విద్యార్థులకు విద్యా జ్యోతులు అందిస్తామని, ప్రతి మండలంలో ఎస్.సి./ఎస్. స్టి రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హామీలు ఇచ్చిందన్నారు.హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా గిరిజనులను మోసం చేయడం సరికాదని ఆయన అన్నారు.తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం కేవలం పరిపాలనా మార్పు కాదని, గిరిజనులకు ఆత్మగౌరవం, స్వపరిపాలన, అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించిన చారిత్రాత్మక నిర్ణయమని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.కేసీఆర్ ప్రభుత్వం గిరిజనుల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామావత్ దాస్రూ నాయక్, టి.వి.ఎన్. రెడ్డి,వెల్లుగురి వల్లపు రెడ్డి, జార్పుల లోక్య నాయక్, కౌన్సిలర్ కేతవత్ రుప్లా నాయక్,రమావత్ రమేష్, రామావత్ మోహన్ కృష్ణ, ఇస్లావాత్ అభిషేక్, కేతవత్ శంకర్ నాయక్, కేతవత్ రవీందర్ తదితరులు ఉన్నారు.

హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి.

-ఓటర్లు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.
-జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ జిల్లా -15సెప్టెంబర్ (మహాప్రభ).
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 (యస్ యస్ ఆర్)ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్‌కు హాజరైన ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.
శుక్రవారం, రామాయంపేట అక్కన్నపేట మండలంలోని ఝాశీసింగ్ లింగాపూర్ లోగ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ రజనీతో కలిసి కలెక్టర్



ప్రతిమాసింగ్ పరిశీలించారు. నోటీసుల జారీ, ఓటర్ల హియరింగ్, ఫారాల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను పర్యవేక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు.
ఓటర్లు సమర్పించే ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వాటిపై తప్పనిసరిగా సంబంధిత ఓటర్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే 2002 సంవత్సరానికి చెందిన ఓటర్ల పేర్ల జాబితాను పరిశీలించి, సరిపోల్చుకోవాలని తెలిపారు. ఓటర్లు సమర్పించిన ఫారాలను పరిశీలించిన కలెక్టర్ అప్‌లోడింగ్ ప్రక్రియను కూడా తనిఖీ చేశారు. ప్రతిరోజు ఎంత మంది ఓటర్లు హియరింగ్‌కు వస్తున్నారు? ఎన్ని దరఖాస్తులు ధ్రువీకరిస్తున్నారు? అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన ప్రతి వ్యక్తి హియరింగ్‌కు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఖచ్చితమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటరు వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రక్రియను నిర్వహించాలని, విధులు కేటాయించిన సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

భూత్పూర్ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

-ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యత: ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గం సెప్టెంబర్ 15 మహాప్రభ
భూత్పూర్: భూత్పూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (+వీ=) సూచించారు. భూత్పూర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ప్రజా సమస్యలపై కౌన్సిలర్లు, అధికారులతో సమీక్షించారు. సమావేశంలో పలు అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించి తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, రోడ్లు, ఫాగింగ్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, వర్షాకాలంలో దోమల వ్యాప్తిని నివారించేందుకు ఫాగింగ్‌ను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. విద్యుత్ సమస్యలను గుర్తించి అవసరమైన స్తంభాలు, లైన్లు,





సాంకేతిక లోపాలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ఏడాదిలో ఆధునిక మున్సిపల్ కార్యాలయం
భూత్పూర్ మున్సిపాలిటీకి అన్ని సౌకర్యాలతో నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదిత నమూనాను ఎమ్మెల్యే పరిశీలించారు. సంవత్సర కాలంలో ఆధునిక మున్సిపల్ కార్యాలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.
హైవే సర్వీస్ రోడ్లపై ప్రత్యేక దృష్టి
జాతీయ రహదారి పరిధిలోని సర్వీస్ రోడ్ల అభివృద్ధిపై నాడు సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే చర్చించారు. అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు అస్తవ్యస్తంగా ఉన్న సైడ్ డ్రైన్లను మెరుగుపరచాలని సూచించారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా హైవే పరిధిలోని మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని తండాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూత్పూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన పూర్తి సహకారం అందిస్తానని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యతగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ సేవాసదనం కోశాధికారి లింగయ్య 83"వ జన్మ దిన వేడుక ఘనంగా జరిగింది





దేవరకొండ సెప్టెంబర్ 15 (మహాప్రభ)
దేవరకొండ ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం కోశాధికారి పంగునూరు లింగయ్య 83"వ జన్మ దిన వేడుక ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వారిని కార్యదర్శి అంకం చంద్రమౌళి, జిల్లా ఉపాధ్యక్షులు కంచర్ల నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి వనం బుచ్చయ్య షాలువకప్పి, కిరీటం దరింపజేసిపుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం అందరికి స్వీట్, తేనిరు అందజేసినారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ నా 83"వ పుట్టినరోజు రోజు ఘనంగా నిర్వహించినందులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.సేవాసధనంనకు కోశాధికారి సేవలను ఆకులపల్లి ఐజాక్ కొనియాడినారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గం సభ్యులు మోటమర్రి పురుషోత్తం, మహమ్మద్ మౌలానా నక్క కొండయ్య,ముసిని వీరయ్య,అలంపల్లి శ్రీనివాస్,మహమ్మద్ అలీ, పెద్దులు, లక్ష్మీనారాయణ, తదితరులు పాలుగోని శుభాకాంక్షలు తెలియజేసినారు

నూతన ఎన్.సి.సి. సిటి ఓగా అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగేందర్ బాధ్యతల స్వీకరణ



దేవరకొండ సెప్టెంబర్ 15(మహాప్రభ)
దేవరకొండ: మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ బోటనీ నాగేందర్ నూతన ఎన్.సి.సి.సి.టి. ఓ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి నాగేందర్‌కు అభినందనలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించడంలో ఎన్.సి.సి. కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత, దేశ సేవ పట్ల అవగాహన కల్పించడంలో ఎన్. సి సి. శిక్షణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నూతన ఎన్. సి.సి. సి.టి. ఓ గా బాధ్యతలు స్వీకరించిన నాగేందర్ ఆధ్వర్యంలో కళాశాల ఎన్. సి.సి. విభాగం మరింత చురుగ్గా పనిచేసి, విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య, సి ఓ ఈ జి.లింగారెడ్డి , ఎన్ . సి.సి. క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యే మేఘారెడ్డికి సూర్యచంద్రారెడ్డి కృతజ్ఞతలు!!

జిల్లా రైతు సలహా కమిటీ వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేసిన సూర్యచంద్రారెడ్డి!!



సెప్టెంబర్ వనపర్తి 15 (మహాప్రభ)
వనపర్తి జిల్లా రైతు సలహా కమిటీ (డీ ఎఫ్ ఏ సి)చైర్మన్‌గా నియమితులైన విట్ట సూర్యచంద్రారెడ్డి, మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ని హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు జిల్లా రైతు సలహా కమిటీ వైస్ చైర్మన్‌గా అవకాశం లభించడంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ, సహకారం కీలకంగా నిలిచినందుకు సూర్యచంద్రారెడ్డి ఎమ్మెల్యే కి పుష్పగుచ్ఛం అందజేసి, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని రైతుల సంక్షేమం కోసం తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని సూర్యచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సాయి చరణ్ రెడ్డి, తిరుపతి రెడ్డి, సర్పంచ్ లింగం, వెంకటేష్, ఆర్యభవన్ శ్రీను, కొత్తకోట చీర్ల శేఖర్ తదితరులు ఉన్నారు.

దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఇకమీదట సబ్ కలెక్టర్ కార్యాలయూ మార్పు



దేవరకొండ సెప్టెంబర్ 15(మహాప్రభ)

నల్గొండ జిల్లా దేవరకొండ రెవిన్యూ డివిజన్ ను సబ్ కలెక్టర్ హోదాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే రాజస్వ మండలాధికారి కార్యాలయం బోర్డును మార్పు చేసి సబ్ కలెక్టర్ కార్యాలయముగా మార్పు చేశారు. ఇక్కడ వీధులు నిర్వహించిన ఆర్డీవో పద్మప్రియ బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ప్రస్తుతం సబ్ కలెక్టర్ గా కరోలిన్ చింగ్టియన్‌మావి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం బోర్డ్ ను చూసి ప్రజలందరూ ఆనందపడుతున్నారు. రానున్న కాలంలో దేవరకొండను జిల్లాగా మారుస్తారని ప్రజలు అనుకుంటున్నారు.

పెద్దవంగర మండల సమస్యలపై అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం





పెద్దవంగర సెప్టెంబర్ 15 (మహాప్రభ)

పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పెద్దవంగర మండలానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాలకుర్తి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలుపై ఎమ్మెల్యే శాఖల వారీగా వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, అంతర్గత రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి సౌకర్యాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పూర్తికాని పనులను నిర్ణయించిన గడువులో ముగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల సమస్యలను సమావేశంలో ప్రస్తావించగా, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలానికి చెందిన వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు పెద్ద శంకరంపేట లో బీసీ కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలి.

---జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా -15సెప్టెంబర్ (మహాప్రభ).

లోది కులానికి చెందిన వారి సమస్యలపై అధ్యయనం చేసేందుకు బీసీ కమిషన్ ఈనెల 16న మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట లో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ గౌరవ నిరంజన్ నేతృత్వంలో కమిటీ సాయంత్రం ఐదు గంటలకు పెద్ద శంకరంపేట మండల కేంద్రానికి విచ్చేసి లోది కులానికి చెందిన వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిపైన అధ్యయనం చేయనట్లు ఆమె తెలిపారు. లోది కులానికి చెందిన వారు కమిషన్ ఎదుట హాజరై వారి సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. జిల్లాలోని గౌరవ ప్రజాప్రతినిధులు అధికారులు అనధికారులు ఆయా కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

పాపన్నపేట మార్కండేయ కాలనీలో ఘనంగా గణనాథునికి పూజలు.



మెదక్ జిల్లా 15సెప్టెంబర్(మహాప్రభ):

మండల కేంద్రమైన పాపన్నపేట మార్కండేయ కాలనీలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్టించిన గణనాథునికి కాలనీ వాసులు ప్రతీ రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మంటప ప్రత్యేక పూజారి చెరువు పల్లి నవీన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వ హిస్తున్నారు.కాలనీకి చెందిన కాలనీ వాసులు, చిన్నారులు పూజ కార్యక్రమాలలో పాల్గొని గణనాథునికి జై...అంటూ బొజ్జ గణపయ్యనూ కొలుస్తున్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి మండల స్థాయి క్రీడోత్సవాలు ప్రారంభం

దేవరకొండ డివిజన్. సెప్టెంబర్ 15 (మహాప్రభ)

చింతపల్లి మండలం గడియ గౌరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా70వమండల స్థాయిక్రీడోత్సవాలుమంగళవారం ప్రారంభమైనాయి. చింతపల్లి మండలం విద్యాశాఖ అధికారి నీరుడు అంజయ్య అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జని యాదగిరిరావు, గడియ గౌరారం గ్రామ సర్పంచ్ సర్పంచ్ ఉజ్జని హేమలత నరేందర్ రావు, ఉప సర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారినీరుడుఅంజయ్య ముఖ్య అతిథులుగా విచ్చేసినమాజీశాసనసభ్యులు, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లతో కలిసి ప్రారంభ సూచికగా చదువు తల్లి సరస్వతి మాత కు పూలమాలతో పుష్పాంజలి ఘటించి తదనంతరం క్రీడా పోటీల ప్రారంభ సూచికగా జ్యోతి ప్రజ్వలన



చేశారు. ఈ సందర్భంగా ఉత్సవపూరిత వాతావరణం.లోవిద్యార్థులు నృత్య ప్రదర్శన చేసి అలరించారు. తదనంతరం క్రీడాపోటీలనుప్రారంభించారు. మండలంలోని పలు పాఠశాలలనుండివిద్యార్థులు విచ్చేసి కబడ్డీ, కోకో, వాలీబాల్, తదితర క్రీడా పోటీలలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల క్రీడా వికాసానికి ముందుకు వచ్చిన దాతలను విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందనలుతెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడలు మానసిక శారీరక దృఢత్వానికి ఎంతో తోడ్పడతాయని క్రీడా స్ఫూర్తితోగెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకుపిలుపునిచ్ రు.ఈకార్యక్రమంలోగెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పద్మాచారి, కృష్ణమ్మ, క్రీడల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు సౌజన్య చంద్రయ్య, పద్మ ,తస్లీమ్, రవి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులువిద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాగణనాథునికి పూజలు

-వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి





దేవరకద్ర సెప్టెంబర్ 15 మహాప్రభ

దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల బీసీ కాలనీలో ప్రతిష్ఠించిన మహా గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దంపతులను 11వ వార్డు కౌన్సిలర్ రాధా కొండల్, 4.వ వార్డు కౌన్సిలర్ ఉమా రాజు ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం కాలనీవాసులతో కలిసి గణనాథుని ఆశీస్సులు పొందారు. వినాయకుని పూజా కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. దీంతో బీసీ కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తుల కోసం కార్యక్రమ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ దాత డీజే రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోస్ భూసేకరణపై రైతులతో ఆర్డీవో ముఖాముఖి

--అభ్యంతరాలు, సమస్యలపై ఆరా.. అభిప్రాయాల నమోదు



దేవరకద్ర సెప్టెంబర్ 15 మహాప్రభ

దేవరకద్ర: బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి చేపడుతున్న భూసేకరణ ప్రక్రియలో భాగంగా రైతుల అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలుసుకునేందుకు ఆర్డీవో బసవాయిపల్లి గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. చౌదర్‌పల్లి, బసవాయిపల్లి, జినుగురాల గ్రామాలకు సంబంధించిన భూసేకరణ అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన వివిధ అంశాలను రైతులతో ఆర్డీవో చర్చించారు. భూముల వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, భూసేకరణపై ఉన్న అభ్యంతరాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన పలు సమస్యలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు వెల్లడించిన అభిప్రాయాలు, అభ్యంతరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు, భూసేకరణ చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి సమావేశం వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో మండల తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, జీపీఓ, బసవాయిపల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, దేవరకద్ర మున్సిపల్ కౌన్సిలర్ మాధవి యుగంధర్ రెడ్డి గ్రామ అధ్యక్షుడు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కూచిరాజుపల్లిలో వార్డు పరిశుభ్రత కార్యక్రమం



మంథని, సెప్టెంబర్ 15(మహా ప్రభ)

మంథని మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు కూచిరాజుపల్లిలో మంగళవారం మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీ, రోడ్లు శుభ్రం చేశారు. మున్సిపాలిటీ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి సూచన మేరకు వర్ష కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన రాకుండా రక్షణ చర్యలు చేపట్టారు..

బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురు అరెస్ట్.

--రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం.

--మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్.



మెదక్ జిల్లా -15సెప్టెంబర్ (మహాప్రభ).

ఎల్దుర్తి మండలం హక్కింపేట గ్రామ పరిధిలోని హక్కింపేట డ్యామ్ సమీపంలో బొమ్మా బొరుసు ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో దేవసోత్ దశరథ్, మల్లారెడ్డి నవీన్‌రెడ్డి, ఎండీ హుస్సేన్, దొడ్డ వినోద్, మల్లబోయిన గణేష్, పాశం మాణిక్‌రెడ్డి, గాండ్ల రాజు ఉన్నారు. వారి నుంచి రూ.24,510 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.జిల్లాలో జూదం, బొమ్మా బొరుసు, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. జూదం వల్ల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పలు సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్టవిరుద్ధ జూదం, బెట్టింగ్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



మెదక్ జిల్లా -15సెప్టెంబర్ (మహాప్రభ).

వినాయక చవితి పండగ సందర్భంగా కొంటూరు చెరువులో జరగబోయే నిమర్జనం ఏర్పాట్ల గురించి మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు మున్సిపల్ కమిషనర్ శ్వై నవీన్, మెదక్ డిఎస్పి, రూరల్ సీఐ, ఎలక్ట్రికల్ ఏడి తో మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి కొంటూరు చెరువును సందర్శించారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కరెంట్ పోల్స్, లైటింగ్, బారికేడ్స్ వేయాలని మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని డిపార్ట్మెంట్ లు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

గాజుల రాజేష్ కుటుంబన్ని పరామర్శించిన మాజీ మంత్రి



దేవరకొండ సెప్టెంబర్ 15(మహా ప్రభ)

దేవరకొండ కు చెందిన లయన్ క్లబ్ సభ్యుడు గాజులరాజేష్ కుమారుడు అభినవ్ రాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదము లో మృతి చెందాడు. విషయం తెలుసు కున్న బీ.ఆర్ ఎస్. రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మంగళవారం ‘ పరామర్శించి అభినవ్ రాజ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమము లో రవీంద్ర కూమర్. భూపాల్ రెడ్డి. కోటిరెడ్డి. భగత్ మాదవ్ రామ చందర్ నాయక్ తదితరులు పాల్గొ న్నరు.

బిజినెస్

భారీగా పతనమైన స్టాక్ మార్కెట్..

- సెన్సెక్స్ 778 పాయింట్లు నష్టం..
- నిఫ్టీ 280 పాయింట్లు లాస్



భారత స్టాక్ మార్కెట్ మంగళవారం భారీగా పతనమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 778 పాయింట్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 280 పాయింట్లు నష్టపోయింది. ఉదయం స్టాక్ మార్కెట్ లాభాల్లోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ దాదాపు 400 పాయింట్లు పెరగగా, నిఫ్టీ కూడా 100 పాయింట్లు పెరిగింది. సెన్సెక్స్ గరిష్టంగా 75,436.44 పాయింట్లు, కనిష్టంగా 73,994.03 పాయింట్లకు చేరింది.మొత్తంగా ఒక రోజులో 1,442.41 పాయింట్ల పతనాన్ని నమోదు చేసింది. చివరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 777.94 పాయింట్లు (1.04 శాతం) నష్టపోయి 74,003.82 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 279.50 పాయింట్లు (1.19 శాతం) నష్టంతో 23,118.60 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్ కూడా నష్టాల్లోనే ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 468.52 పాయింట్లు (2.50 శాతం) నష్టపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్ 226.73 పాయింట్లు (2.47 శాతం) నష్టపోయింది. నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ మెటల్ షేర్లు కూడా నష్టపోగా.. నిఫ్టీ ఐటీ షేర్లు మాత్రం భారీగా లాభపడ్డాయి.సెన్సెక్స్ 30 ఇండెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు లాభాల్లో ముగియగా.. ఇండిగో, అదానీ స్పోర్ట్స్, బీఈఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.30 శాతం పెరిగి 107 డాలర్లకు చేరింది. బంగారం ఔన్స్ ధర 4,273.11 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. రూపాయి విలువ వరుసగా ఐదో సెషన్‌లోనూ బలహీనపడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.96గా ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి.

బంగారం ధరలకు బ్రేక్.

భారీగా తగ్గిన పసిడి ధరలు



బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కాస్త ఊరట లభించింది. వరుసగా పెరుగుతూ వచ్చిన పసిడి ధరలు మంగళవారం తగ్గుముఖం పట్టాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల బంగారం ధర భారీగా తగ్గింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరపై రూ.850 తగ్గడంతో రూ.1,40,400కు చేరింది. అదే సమయంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర కూడా తగ్గింది. 10 గ్రాముల 24 క్యారెట్ల పసిడి ధర రూ.920 తగ్గి రూ.1,53,170గా నమోదైంది. బంగారం ధరలు తగ్గడంతో ఆభరణాల కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి ఇది కొంత ఉపశమనాన్ని కలిగించే అంశంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకునే పరిణామాలు, డాలర్ మారకం విలువ, దేశీయంగా బంగారానికి ఉండే డిమాండ్, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలు పసిడి ధరలపై ప్రభావం చూపుతుంటాయి. ఈ నేపథ్యంలో మంగళవారం బంగారం ధరలు తగ్గాయి.

వెండి ధరలో మార్పు లేదు

మరోవైపు వెండి ధర మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. కిలో వెండి ధరలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. కిలో వెండి ధర రూ.2,50,000 వద్దనే కొనసాగుతోంది. దీంతో బంగారం ధరలు తగ్గినా.. వెండి కొనుగోలు చేసే వారికి మాత్రం ధరలో ఎలాంటి ఊరట లభించలేదు.

తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ మంగళవారం ఇదే స్థాయిలో బంగారం, వెండి ధరలు కొనసాగనున్నాయి. అయితే ఆభరణాల దుకాణాల్లో వాస్తవంగా చెల్లించే మొత్తం మాత్రం కొంత భిన్నంగా ఉండొచ్చు. బంగారం ధరకు అదనంగా తయారీ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర వ్యాపార ఛార్జీలు కలవడంతో తుది ధర మారే అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,40,400, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,53,170గా ఉండగా.. కిలో వెండి రూ.2,50,000 వద్ద కొనసాగుతోంది. పసిడి ధరలు మరింత తగ్గుతాయా, లేక మళ్లీ పెరుగుతాయా అన్నది రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు, దేశీయ డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది.

భారీ డిస్కౌంట్ల వెనుక అసలు లాభం ఇదే!



పండుగ సీజన్ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఇ-కామర్స్ సంస్థలు 70--80 శాతం వరకు భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి. ఇంత తగ్గింపు ఇచ్చినా కంపెనీలు పలు మార్గాల్లో ఆదాయం పొందుతున్నాయి. విక్రేతల కమీషన్లు, ప్రకటనల ఆదాయం, బల్క్ సెల్లింగ్, పాత స్టాక్ క్లియరెన్స్ వంటివి ఇందులో కీలకం.

అదేవిధంగా 'పరిమిత స్టాక్', 'ఆఫర్ మరికొద్ది గంటలే' అంటూ ఖీమీ సృష్టించి కొనుగోళ్లను పెంచుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో ముందుగా ధర పెంచి, ఆపై భారీ డిస్కౌంట్‌గా చూపించే విధానాలపై విమర్శలు ఉన్నాయి. అందుకే ఆఫర్ చూసి వెంటనే కొనకుండా ధరలను పోల్చి చూడటం మంచిది.

స్పోర్ట్స్

చేజారుతున్న సచిన్ రికార్డులు..
సుదీర్ఘ కెరీర్‌తో చరిత్ర సృష్టించిన టేలర్..!





అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ రికార్డులు వరసగా చేజారుతున్నాయి. ఇప్పటికే వన్డేల్లో అత్యధిక శతకాల యోధుడిగా విరాట్ కోహ్లీ అవతరించగా.. టెస్టుల్లో అత్యధిక హాఫ్ సెంచరీలతో జో రూట్ ముందంజ వేశాడు. ఇప్పుడు వన్డేల్లో సచిన్ పేరిట ఉన్న సుదీర్ఘ కెరీర్ రికార్డు కనుమరుగైంది. జింబాబ్వే ఆటగాడు బ్రెండన్ టేలర్ అత్యధిక సంవత్సరాల కెరీర్‌తో టీమిండియా వెటరన్‌ను రెండో స్థానానికి నెట్టేశాడు.ప్రపంచ క్రికెట్‌లో మరో రికార్డు బద్దలైంది. సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌తో సచిన్ టెండూల్కర్‌ను బ్రెండన్ టేలర్(జింబాబ్వే) అధిగమించాడు. రెండు దశాబ్దాలకు పైగా వన్డేలను ఏలిన సచిన్ టన్నుల కొద్దీ పరుగులతో, నూరు శతకాలతో ఆల్‌టైమ్ రికార్డు తన పేరిట రాసుకున్నాడు. కానీ, సుదీర్ఘ కెరీర్ కొనసాగించిన ఆటగాడిగా మాత్రం రెండో స్థానానికి పడిపోయాడు.వన్డేల్లో మాస్టర్ బ్లాస్టర్ 22 ఏళ్ల 91 రోజులు ఆడగా.. ఇప్పుడు టేలర్ 22 ఏళ్ల 148 రోజులతో చరిత్ర సృష్టించాడు. టేలర్ 2004 ఏప్రిల్ 20వ తేదీన వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అవినీతి కేసులో మూడేళ్ల నిషేధం అనంతరం పునరాగమనం చేసిన టేలర్.. మళ్లీ మైదానంలోకి దిగాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న టేలర్.. ఇప్పటికే సుదీర్ఘ కెరీర్‌తో సచిన్‌ను అధిగమించాడు. శ్రీలంక మాజీ ఆటగాడు సనత్ జయసూర్య మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఈ లంక వెటరన్ 21 ఏళ్ల 184 రోజులు వన్డే క్రికెట్ ఆడాడు.

డ్రగ్స్‌కు బానిసై

భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్ కప్(2011) తర్వాత జింబాబ్వేకు సారథ్యం వహించిన టేలర్.. 2015 వరకూ కెప్టెన్‌గా కొనసాగాడు. అయితే.. అనూహ్యంగా 2021లో క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అందుకు కారణం డ్రగ్స్, ఆల్కహాల్. ఈ రెండింటికీ బానిసగా మారిన అతడు రిహాబిలిటేషన్ కేంద్రంలో చేరాడు. అక్కడ నిపుణుల ప్రేరణతో టేలర్‌లో మార్పు వచ్చింది. మునపటి మనిషిలా మారిన అతడు ఇంటివద్దనే కుర్రాళ్లకు కోచింగ్ ఇవ్వడం ప్రారంభించాడు. ప్రస్తుతం వన్డే, టీ20లకు సారథులగా ఉన్న సియన్ విలియమ్స్(39 ఏళ్లు), సికిందర్ రజా(38 ఏళ్లు) తనకు స్ఫూర్తి అని చెప్పాడు టేలర్.

స్పిన్ మ్యాజిక్‌తో 800 పాయింట్లు..

-భారత తొలి బౌలర్‌గా చరణి రికార్డు..!



మహిళల ఆసియా కప్‌లో వికెట్ల వేటతో రెచ్చిపోయిన శ్రీచరణి మరో ఘనత సాధించింది. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక రేటింగ్ పాయింట్లతో చరిత్ర సృష్టించిందీ స్పిన్ సంచలనం. ఆ మధ్యే నంబర్ 1 టీ20 బౌలర్‌గా అవతరించిన ఈ తెలుగమ్మాయి తాజాగా 800 పాయింట్ల క్లబ్‌లో చేరింది. తద్వారా ఈ మైలురాయిని అందుకున్న టీమిండియా తొలి బౌలర్‌గా చరణి మరో రికార్డు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఆమె 804 రేటింగ్‌తో టాప్‌లో కొనసాగుతుండగా.. భారత్‌కే చెందిన ఆల్‌రౌండర్ దీప్తి శర్మ 729 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.ఐసీసీ మహిళల టీ20 బౌలర్లలో అందరికంటే ముందున్న భారత స్పిన్నర్ శ్రీ చరణి తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఇటీవల దుబాయ్‌లో ముగిసిన మహిళల ఆసియా కప్ లో 12 వికెట్లతో సత్తా చాటిన ఈ తెలుగమ్మాయి 800 రేటింగ్ పాయింట్లు సాధించింది. ఫైనల్లో నాలుగు వికెట్లతో భారతజట్టు ఎనిమిదోసారి ఆసియా కప్ గెలుపొందడంలో కీలకమైన చరణి 804 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. రెండో ర్యాంకర్ దీప్తి శర్మకు ఆమెకు 75 పాయింట్ల తేడా ఉంది.

వరల్డ్‌కప్‌లో తిప్పేసి

ఏడాది క్రితం అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన శ్రీ చరణి నంబర్ 1 ర్యాంక్ పట్టేసింది. నిలకడగా రాణిస్తున్న ఈ తెలుగమ్మాయి అంతర్జాతీయ టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న పొట్టి వరల్డ్‌కప్‌లో తిప్పేసిన ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ టాప్ ర్యాంక్‌కు ఎగబాకింది. 2025 జూన్ 28న ఇంగ్లండ్‌తో మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ పొట్టి ఫార్మాట్లో అడుగుపెట్టిన చరణి.. తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా విజయాల్లో కీలకవుతూనే.. వ్యక్తిగతంగా తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకుంది. గతేడాది స్వదేశంలో 14 వికెట్లతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలకమైందీ కడప బిడ్డ.

టెస్టుల్లో ఫ్లాప్.. వన్డేల్లో తొలి శతకంతో రెచ్చిపోయిన కుర్రాడు..!



మూడేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం అదరకున్నా వన్డేల్లో మాత్రం దంచేశాడు మ్యాట్ రెన్‌షా . బంగ్లాదేశ్‌పై తీవ్రంగా నిరాశపరిచిన అతడు జింబాబ్వేపై చితక్కొట్టాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన తొలి వన్డేలో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఈ కుర్రాడు శతకం బాదేశాడు. బ్రాడ్ ఎవాన్స్ ఓవర్లో సింగిల్ తీసిన అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో మొదటి సెంచరీ నమోదు చేశాడు.స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో విఫలమైన ఆస్ట్రేలియా కుర్రాడు మ్యాట్ రెన్‌షా వన్డేల్లో శతక్కొట్టాడు. మంగళవారం హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జింబాబ్వే బౌలర్లను ఈ లెఫ్ట్ హ్యాండర్ ఉతికేశాడు. టాపార్డర్ విఫలమైనా వన్డేల్లో మొదటి సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. 107కే నాలుగు వికెట్లు పడిన వేళ.. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అతడు జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 18వ ఓవర్లో క్రీజులోకి వచ్చి ధనాధన్ ఆటతో అలరించిన అతడు 94 బంతులు ఎదుర్కొని 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 109 రన్స్ సాధించాడు.ఆతిథ్య బౌలర్లను ఎడాపెడా ఉతికేస్తూ.. అలెక్స్ క్యారీ, ఓలీ పీకేలతో కలిసి రెన్‌షా విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు రెన్‌షా. దాంతో, ఆసీస్ 8 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న ఆస్ట్రేలియాకు.. రెన్‌షా రూపంలో ఆరో స్థానంలో అదరగొట్టే బ్యాటర్ దొరికాడు. ఈ సెంచరీతో అతడు వన్డే జట్టులో తన స్థానం పదిలం చేసుకుంటాడా? లేదా? అనేది త్వరలోనే తెలియనుంది.



బాక్సాఫీస్ వద్ద 'మండాడి' మేనియా..

- 5 రోజుల్లో రూ.65 కోట్లు..
- ఓటీటీ డీల్‌తో నిర్మాతకు జాక్‌పాట్!



తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రం, విడుదలై కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.65 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బోట్ రేసింగ్ నేపథ్యంతో సాగే వినూత్న కథాంశం, అద్భుతమైన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థ్రియేటర్లకు క్యూ కట్టేలా చేస్తున్నాయి.అయితే ఈ సినిమా కమర్షియల్ విజయంతో పాటు, దీని డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన న్యూస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రూ.45 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. అయితే, ఈ డీల్ వెనుక ఒక ఆసక్తికరమైన బాక్సాఫీస్ లింక్ ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. మొదట నిర్మాత ఎల్రెడ్ కుమార్ రూ.25 కోట్లు డిమాండ్ చేయగా, నెట్‌ఫ్లిక్స్ రూ.15 కోట్లు మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య ఒక వినూత్న షరతుతో కూడిన ఒప్పందం కుదిరింది. సినిమా వసూళ్ల ఆధారంగా పారితోషికం పెరిగేలా ప్లాన్ చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా రూ.50 కోట్లు దాటితే రూ.30 కోట్లు, అలాగే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మధ్య వసూలు చేస్తే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.65 కోట్ల మార్క్‌ను అందుకోవడంతో, నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన బడ్జెట్‌లో సగానికి పైగా కేవలం ఓటీటీ హక్కుల ద్వారానే వెనక్కి వస్తుండటంతో నిర్మాతకు ఇది అసలు సిసలు జాక్‌పాట్ అని చెప్పవచ్చు. ఇదే జోరు కొనసాగితే 'మండాడి' త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆసక్తికరంగా జి.వి. ప్రకాష్ కుమార్ ఇమ్మోర్టల్' తెలుగు ట్రైలర్



సంగీత దర్శకుడిగా, నటుడిగా టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జి.వి. ప్రకాష్ కుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'ఇమ్మోర్టల్' . తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. మారీయప్పన్ చిన్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించగా తాజాగా తెలుగులో సెప్టెంబర్ 19న విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రంలో కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు.ఇక ఈ ట్రైలర్ చూస్తే.. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రారంభంలో జి.వి. ప్రకాష్ కుమార్ మరియు కాయదు లోహర్ మధ్య లవ్ స్టోరీగా అనిపించినా, ఆ తర్వాత కథ పూర్తిగా ఒక రహస్యమైన మలుపు తిరుగుతుంది. ఈ చిత్రంలో కథాంశం మరణం లేని ఒక రహస్య వ్యక్తి చుట్టూ తిరుగుతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. సామ్ సి.ఎస్ అందించిన నేపథ్య సంగీతం మరియు విజువల్స్ ప్రేక్షకులను భయపెడుతూనే, సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి.

నిజమే అనుకుని ఏడ్చేదాన్ని..

ప్రస్తుతం బాలీవుడ్‌లో ఆలియాభట్ ప్రభ ఓ స్థాయిలో వెలుగుతున్నది. ఓ వైపు స్టార్‌డమ్‌ని, మరోవైపు కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ ఆనందకరమైన జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారామె. తాజాగా ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆలియా.. 'కావాలని ఇతరులకు కోపం తెప్పించడం, లేదా చిరాకు పుట్టించడం' అనే అంశంపై మాట్లాడుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 'చిన్నతనంలో మా అక్క షాహీన్ నిరంతరం నన్ను కోపానికి గురిచేసేది.నాకింకా బాగా గుర్తు.. నాకు నాలుగేళ్లు ఉన్నప్పుడు 'నువ్వు అమ్మానాన్నలకు సొంత బిడ్డవు కావు. పార్లే-జి బిస్కెట్ ప్యాకెట్ కొంటే ఫ్రీగా నిన్ను ఇచ్చారు' అని చెప్పి ఏడిపించేది. ఆమె సరదాగా అంటున్న ఆ మాటలను నిజమే అనుకుని ఏడ్చేదాన్ని. ఇప్పుడు ఆ క్షణాలు గుర్తొస్తే నవ్వొస్తుంది. ఏదేమైనా ఇలాంటి చిలిపి గొడవలే అక్కాచెల్లెళ్ల బంధాలను బలోపేతం చేస్తాయని నా నమ్మకం' అని గుర్తు చేసుకున్నారు ఆలియా. ప్రస్తుతం 'డోంట్ బీ షైన్' అనే సినిమాను నిర్మిస్తున్న ఆలియా.. లవ్ అండ్ వార్, తుంబాడ్2 చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు

అమెజాన్ ప్రైమ్‌లో దూసుకుపోతున్న 'హుషార్ పిట్టలు'..

- ఓటీటీలోనూ అంచనాలకు మించి రెస్పాన్స్!



సినిమా పరిశ్రమలో చిన్న చిత్రంగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ రంగంలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం, ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో అధికారికంగా స్ట్రీమింగ్ ప్రారంభించుకుంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన సినీ ప్రియులు, ప్రస్తుతం ఓటీటీలో చూసేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు.కేవలం యూత్‌ను మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను, కుటుంబాలను ఆకట్టుకునేలా అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ను మరియు వాసవి గణేషన్ జంటగా నటించిన ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా రియలిస్టిక్ సన్నివేశాలు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, పద్మ అమ్మ మరియు బీవీజీ స్టూడియోస్ సహకారంతో ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వినూత్న కథాకథనాలతో ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహించగా, సురేష్ ఏషియన్ ఫిలింస్ సంస్థ దీనిని థియేటర్లలో ఘనంగా విడుదల చేసింది. థియేటర్లలో ప్రేక్షకులే స్వయంగా ప్రచారకర్తలుగా మారి ఈ సినిమాను పెద్ద హిట్ చేశారని, ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్‌కు ఈ చిత్రం మరింత చేరువవుతోందని చిత్ర నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంచి టైమ్ పాస్ కోసం చూస్తున్న మూవీ లవర్స్‌కు 'హుషార్ పిట్టలు' ఒక చక్కటి ఎంపిక అని చెప్పవచ్చు.

ఆకట్టుకుంటున్న 'అనుమాన పక్షి' ట్రైలర్!



యువతను విపరీతంగా ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన 'డీజే టిల్లు' చిత్ర దర్శకుడు విమల్ కృష్ణ ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. టాలెంటెడ్ హీరో రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి' . తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది.ట్రైలర్‌ను గమనిస్తే.. హీరో పాత్రలోని 'అనుమానం' అనే బలహీనత చుట్టూ కథ ఎంతో ఆసక్తికరంగా, నవ్వులు తెప్పించేలా నడుస్తుందని స్పష్టమవుతోంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే వ్యక్తిగా రాగ్ మయూర్ అద్భుతమైన హావభావాలతో కడుపుబ్బా నవ్విస్తున్నారు. కేవలం కామెడీ మాత్రమే కాకుండా ఇందులో మంచి క్రైమ్ థ్రిల్లర్ మరియు డార్క్ కామెడీ ఎలిమెంట్స్ కూడా జోడించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, శ్రీచరణ్ పాకాల అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వైవిధ్యమైన కథాకథనాలతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. డీజే టిల్లు లాంటి మాస్ ఎంటర్‌టైనర్ తర్వాత విమల్ కృష్ణ ఈసారి ఎలాంటి వినోదాన్ని పంచబోతున్నారోనని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com